www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO. APTEL/2010/33229

TELANGANA RISING 2047

సంపుటి : 16 | సంచిక :197 | శుక్రవారం 12.09.2025 | ఎడిటర్ :కొమరాజు శ్రీనివాసులు | పేజీలు :08 | వెల : రూ 2/-



## తీర్పును రిజర్వ్ చేసిన సుప్రీం కోర్టు

### బిల్లులపై రాష్ట్రపతి, గవర్నర్లు ఆమోదం కేసులో

- పిటిషన్ దాఖలు చేసిన తమిళనాడు
- ఏప్రిల్ 8న 415 పేజీల తీర్పు ఇచ్చిన సుప్రీం
- 3 నెలల్లోపు నిర్ణయం తీసుకోవాలని వెల్లడి
- మరో మారు విచారించి రిజర్వ్ చేసిన సుప్రీం
- ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం నిర్ణయం

05





## హైదరాబాద్-చెన్నై బుల్లెట్ ట్రైన్

### భవిష్యత్కు అనుగుణంగా రైల్వే ప్రణాళికలు

- రీజనల్ రింగ్ రైల్ ఆవశ్యకతపై చర్చ
- ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతికి కొత్త లైన్
- వికారాబాద్ కృష్ణా కొత్త రైల్వే లైన్ పనులు పురోగతి
- రైల్వేలపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష
- అధికారులకు దిశా నిర్దేశం చేసిన ముఖ్యమంత్రి
- తెలంగాణకు రీజినల్ రింగ్ రైల్ ముఖ్యం
- గ్రీన్ ఫీల్డ్ హైవేకు అనుసంధానంగా ఫ్యూచర్ సిటీ నుంచి రైల్వే లైన్
- భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని ప్రణాళికలు రెడీ చేయాలె
- పెండింగ్ రైల్వే ప్రాజెక్టులపై సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :**

పెండింగ్లో ఉన్న రైలు ప్రాజెక్టులు, లైన్లను వేగవంతంగా పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అవసరమైన నిధులను సమకూర్చటంతో పాటు భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ప్రాజెక్టుల అలైన్మెంట్లు ఉండాలని దూరాభారం తగ్గించి, అంచనా ఖర్చును కూడా తగ్గించుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రయాణికులకు వేగవంతమైన రవాణా సదుపాయాలు అందించటంతో పాటు కొత్తగా వేసే రైలు మార్గాలన్నీ ఆయా ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధికి ఉపయోగపడేలా ఉండాలన్నారు. ప్రధానంగా పర్యాటక కేంద్రాలు, పారిశ్రామిక అవసరాలను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. విదేశాల తరహాలో రైలు, రోడ్డు, పోర్ట్ కనెక్టివిటీని అధునాతనంగా అభివృద్ధి చేయాలన్నారు. రాష్ట్రంలో పెండింగ్ రైల్వే ప్రాజెక్టులు, కొత్తగా ప్రతిపాదనలో ఉన్న ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం మిగితా 02 పేజీలో...

## సీఎం రేవంత్ మేడారం టూర్



### నేపాల్ తాత్కాలిక ప్రధానిగా కుల్మన్ ఘీసింగ్

కేపీ శర్మ ఓలి పదవి నుంచి తప్పుకున్న తర్వాత నేపాల్ విద్యుత్ అథారిటీ మాజీ మేనేజింగ్ డైరెక్టర్ కుల్మన్ ఘీసింగ్ నేపాల్ తాత్కాలిక ప్రధానమంత్రిగా నియమితులయ్యారు.

02



### వాళ్లు కావాలనే సరఫరా చేయడం లేదు..

యూరియా కొరత పై విపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని మంత్రి సీతక్క అన్నారు. యూరియా కేంద్ర ప్రభుత్వం పరిధిలో ఉందన్నారు. కావాలనే బీఆర్ఎస్ నాయకులు రైతులను రెచ్చగొట్టి రోడ్లపై ధర్నా

03




### సాదాబైనామాల క్రమబద్ధీకరణకు రంగం సిద్ధం

తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సాదాబైనామాల క్రమబద్ధీకరణపై రెవెన్యూశాఖ తాజా నోటిఫికేషన్ ను విడుదల చేసింది. తెలంగాణ భూ భారతి చట్టం, 2025లోని సెక్షన్ 6, సబ్-సెక్షన్ (1)


05

## ఉద్యోగాల దొంగలెవరో తేల్చాల్సిందే

### కాసులకు కక్కుర్తి.. అంగట్లో ఉద్యోగాలు

- నిరుద్యోగుల గొంతు కోసిన సీఎం రేవంత్ రెడ్డి..
- అమ్మా, నాన్నల కష్టార్జితం బూడిద పాలు
- గ్రూప్1 అవకతవకలకు రేవంత్ సర్కార్ బాధ్యత..
- మోసపూరిత వాగ్దానాలపై అసెంబ్లీలో చర్చించాలి
- యువత ఎన్నటికీ కాంగ్రెస్ సర్కార్ను క్షమించదన్న కేటీఆర్

03



సర్కారు కొలువు కోసం ఏళ్ల తరబడి కష్టపడి తమ విలువైన సమయాన్ని.. అమ్మా, నాన్నల కష్టార్జితాన్ని ధారపోసి పోటీ పరీక్షలు రాసే తెలంగాణ యువత నమ్మ కాన్ని ఈ కాంగ్రెస్ సర్కార్ వమ్ముజేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ మేరకు ఎక్స్ ఖాతాలో గురువారం ట్వీట్ చేశారు. అసమర్థత, కాసుల కక్కుర్తి కలగలిసి అనేక అవకతవకలకు కాంగ్రెస్ ప్రభుత్వం కారణమైందని మండిపడ్డారు.

## మ్యాన్ హోల్‌లో పడిపోయిన ఐదేళ్ల బాలిక..



- హైదరాబాద్ యాకుత్‌పురాలో తెరిచి వదిలిన మ్యాన్‌హోల్‌లో విద్యార్థిని పడిన ఘటన
- అప్రమత్తంగా స్పందించిన తల్లి, చిన్నారి ప్రాణాన్ని రక్షించింది
- జీహెచ్ఎంసీ నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం
- ప్రాణాలు తీసే మ్యాన్‌హోళ్లపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్

06

## మెదక్‌లో మరోసారి భారీ వర్షం..

- రెండు గంటల్లో 7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు
- లోతట్టు ప్రాంతాలు, కాలనీలు జలమయం
- మెదక్-హైదరాబాద్ హైవేపై ట్రాఫిక్ అంతరాయం
- పారిశుధ్య లోపాలపై ప్రజల ఆవేదన

06






## ఖర్గే మాటలు చూస్తే నవ్వొస్తుంది..

### అన్ని రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైంది

- కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని రామచందర్ రావు విమర్శలు
- ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్‌పై ఇండియా కూటమిని ఎద్దేవా
- యూరియా కొరతకు కారణం రాష్ట్ర ప్రభుత్వమేనని వ్యాఖ్య
- ఉద్యోగులు, విద్య, జీతాల అంశాలపై సీఎం వాగ్దానాలను గుర్తు చేసిన బీజేపీ చీఫ్

03

## బీఆర్ఎస్.. నెంబర్ 1

### బీఆర్ఎస్ ఆదాయం 685 కోట్లు..

- దేశంలోనే అత్యంత సంపన్న పార్టీ
- రెండో ప్లేస్లో తృణమూల్ కాంగ్రెస్.. నాలుగు, ఐదు స్థానాల్లో టీడీపీ, వైసీపీ
- దేశ వ్యాప్తంగా మొత్తం 40 ప్రాంతీయ పార్టీలు.. వాటి మొత్తం ఆదాయం ₹2,532.09 కోట్లు
- అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ నివేదికలో వెల్లడి

40 ప్రాంతీయ పార్టీల ఖర్చులు రూ.1,320 .96 కోట్లుగా ఉన్నాయని ఏడీఆర్ తన రిపోర్టులో వెల్లడించింది. ఇందులో బీఆర్ఎస్ రూ.254.914 కోట్లు ఖర్చు చేసినట్టు తెలిపింది. వైసీపీ, డీఎంకే, ఎస్పీ, జేడీయూ సహా 12 పార్టీలు ఆదాయానికి మించి ఖర్చు చేసినట్టు చెప్పింది. జీరో ఆదాయం ఉన్న గోవా ఫార్వర్డ్ పార్టీ రూ.1.56 లక్షల ఖర్చు చూపిందని పేర్కొంది.

దేశంలోని ప్రాంతీయ పార్టీల ఆదాయంలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల పార్టీలు సత్తా చాటాయి. 2023–24 సంవత్సరానికి గాను అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) విడుదల చేసిన నివేదిక ప్రకారం బీఆర్ఎస్ పార్టీ దేశంలోనే అత్యంత సంపన్న ప్రాంతీయ పార్టీగా మొదటి స్థానంలో నిలిచింది. ఈ జాబితాలోని తొలి ఐదు స్థానాల్లో మూడు ఏపీ, తెలంగాణకు చెందిన పార్టీలు ఉండటం విశేషం. బీఆర్ఎస్ ₹685.51 కోట్ల ఆదాయాన్ని ప్రకటించింది. ఆ తర్వాత తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ₹646.39 కోట్లతో రెండో స్థానంలో నిలిచింది.

05





## ప్రెషర్ కుక్కర్ తో తలపై కొట్టి చంపేశారు..

- ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో రేణు అగర్వాల్ దారుణ హత్య
- కత్తులు, చాకులు, రైస్ కుక్కర్‌తో దాడి.. కిరాతకంగా హత్య
- జార్ఖండ్‌కు చెందిన హర్ష, రోషన్‌లపై పోలీసులు అనుమానం
- అనుమానితుల కోసం ఐదు ప్రత్యేక బృందాలతో గాలింపు ప్రారంభం
- ప్రెషర్ కుక్కర్ తో పాశవికంగా తలపై కొట్టి చంపిన వైనం

06

## కలకలం రేపుతున్న ఉగ్ర కదలికలు

బోధన్ యువకుడు ఉజైఫా యామన్ అరెస్ట్ ఉజైఫాను అరెస్ట్ చేసిన ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు



- నిజామాబాద్ జిల్లాలో కలకలం రేపుతున్న ఉగ్ర కదలికలు
- ఢిల్లీ తీసుకెళ్లి ప్రశ్నిస్తున్న పోలీసులు
- రాంచీలో ఉగ్రవాది డ్యానిష్ ఇచ్చిన సమాచారంతో ఉజైఫా అరెస్ట్
- ఉజైఫా యామన్ దగ్గర ఎయిర్ పిస్టల్, బుల్లెట్లు స్వాధీనం

05

## ఇండియా కూటమిలో క్రాస్ ఓటింగ్ చిచ్చు..

### ఉపరాష్ట్రపతి ఎన్నికలోనూ ఓట్ల చోరీ

- బీజేపీపై రాహుల్ గాంధీ ఫైర్
- ఓట్ల దొంగ గద్దె దిగాలని తీవ్ర వ్యాఖ్యలు
- ఇండియా కూటమిలో కలకలం రేపిన క్రాస్ ఓటింగ్
- కూటమి అభ్యర్థికి ఊహించిన దానికంటే తక్కువ ఓట్లు
- కాంగ్రెస్, శివసేన, డీఎంకే ఎంపీలపై క్రాస్ ఓటింగ్ అనుమానాలు

03



## విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తా..

- మంథనిలో విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తా..
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు
- కలెక్టర్ తో కలిసి మంథని మున్సిపాలిటీలో విస్తృత పర్యటన
- పిల్లలు మంచి నాయకత్వ లక్షణాలు, లక్ష్యాన్ని కలిగి ఉండాలి : సినీ నటి మంచు లక్ష్మి

05



# యూరియా కోసం రోడ్డెక్కిన అన్నదాత..

**కామారెడ్డి,ఫ్లాష్ ఇండియా :** యూరియా కోసం రైతన్నలు రోడ్డు ఎక్కుతున్న సంఘటనలు రోజుకో మండలంలో ఎక్కడో ఒకచోట చోటు చేసుకుంటూనే ఉన్నా సరిపడా యూరియా సరఫరా చేయడంలో అటు ప్రభుత్వం, ఇటు అధికారులు విఫలమయ్యారు. తాజాగా గురువారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఉదయం నుంచి యూరియా కోసం క్యూ లైన్ లో నిలుచున్న రైతులు సరిపడా యూరియా లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ సిరిసిల్ల-కామారెడ్డి రోడ్డుపై గంజి గేటుకు ఎదురుగా బైఠాయించి నిరసన తెలిపారు. ప్రస్తుతం పంటలకు ప్రత్యేక అవసరమైన యూరియా సరఫరా చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని వహిస్తుందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

**టోకెన్లు ఇచ్చి పంపించిన అధికారులు..**

కామారెడ్డి జిల్లా కేంద్రంలో 200 బ్యాగుల యూరియా ఉండగా అంతకు రెట్టింపు మంది రైతులు యూరియా కోసం వచ్చి క్యూ లైన్ లో నిల్చున్నారు. దీంతో ఇక్కడున్న యూరియా ఎవరికి సరిపోదని గ్రహించిన అధికారులు మళ్లీ రేపు కూడా యూరియా లోడ్ వస్తుందని, ఇప్పుడున్న యూరియాతో పాటు రేపు వచ్చే యూరియాకు కూడా కలిపి టోకెన్లు ఇస్తామని రైతులను సర్ది చెప్పి టోకెన్లు ఇచ్చి పంపించి వేశారు. కాగా ఈ విషయమై మండల వ్యవసాయాధికారి పవన్ కుమార్ మాట్లాడుతూ.. కామారెడ్డి మండలంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల రైతులు తరలి రావడం వల్లనే ఈ పరిస్థితి వచ్చిందన్నారు. రైతులందరికి సరిపడా యూరియా అందజేస్తామన్నారు.

# నిర్మాత దంపతులపై జూబ్లీహిల్స్‌లో కేసు నమోదు

## నమ్మి పదేళ్లు లీజు కిస్తే 99 ఏండ్ల లీజుకు ఫోర్జరీ..

**జూబ్లీహిల్స్,ఫ్లాష్ ఇండియా :** పదేళ్లపాటు ఇంటిని లీజుకు ఇస్తే , ఫోర్జరీ పత్రాలతో 99 ఏండ్ల లీజుకిచ్చారంటూ ఎన్ ఆర్ ఐకి చెందిన భవనాన్ని ఆక్రమించి, వృద్ధురాలిని బెదిరింపులకు గురిచేసిన వ్యక్తిపై జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు అయ్యింది. వివరాల్లోకి వెళితే.. జూబ్లీహిల్స్ రోడ్ నెం.10లో నివాసం ఉంటున్న సీహెచ్ .లక్ష్మీశ్వరి(85) అనే వృద్ధురాలి కొడుకు తిరుమల వెంకటేష్ అమెరికాలో ఉంటారు. అతడికి జూబ్లీహిల్స్ రోడ్ నెం 25లో 576 గజాల స్థలంలో భవనం ఉంది. 2012లో సినీ నిర్మాత షేక్ బషీద్ , అతడి భార్య షేక్ కరీమున్నీసా లీజుకు తీసుకున్నారు. పదేళ్లపాటు లీజుకు ఇచ్చినట్లు ఒప్పందం కుదుర్చుకున్నారు. 2023లో లీజు గడువు ముగియడంతో ఖాళీ చేయాలని యజమానులు చెప్పగా తమకు 99 ఏండ్ల పాటు లీజు ఉందంటూ పత్రాలు చూపించారు. 2012నుంచి 2112 దాకా ఇంటిని ఖాళీ చేసే ప్రసక్తి లేదంటూ షేక్ బషీద్ చెప్పడంతో లక్ష్మీశ్వరి షాక్ కు గురయ్యారు. తప్పుడు పత్రాలతో తన ఇంటిని కాజేసే కుట్ర చేస్తున్నారంటూ బాధితురాలు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో షేక్ బషీద్ మీద 34 క్రిమినల్ కేసులు పెండింగ్ లో ఉన్నాయని, అతడిపై పంజాగుట్ట పీఎస్ లో రౌడీషీట్ సైతం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు షేక్ బషీద్ తోపాటు అతడి భార్య కరీమున్నీసాల మీద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# పురాతన ఇళ్లలో ఉన్న వారిని ఖాళీ చేయించండి

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో వర్షాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. పురాతన ఇళ్లలో ఉన్నవారిని తక్షణమే గుర్తించి ఖాళీ చేయించాలని ఆదేశించారు. కాజ్ వేలు, కల్వర్టుల దగ్గర అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇరిగేషన్ అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని చెప్పారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఇదిలా ఉంటే.. గురువారం సాయంత్రం గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా వర్షం దంచికొట్టింది. దీంతో రహదారులు జలమయమయ్యాయి. మోకాళ్ల లోతు నీరు చేరడంతో ఎక్కడికక్కడ ట్రాఫిక్ నిలిచిపోయింది. ముఖ్యంగా హయత్ నగర్ నుంచి ఎల్బీనగర్ వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వెంటనే అప్రమత్తమైన అధికారులు, సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

# భారీ ఎన్ కౌంటర్..

**ఛత్తీస్‌గఢ్:** ఛత్తీస్ గఢ్ లోని సుక్మా జిల్లా దండకారణ్యం మరోసారి దద్దరిల్లింది. గురువారం భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య భారీ ఎన్ కౌంటర్ జరిగింది. ఈ ఎన్ కౌంటర్ లో దాదాపు 10 మంది మావోయిస్టులు మృతిచెందినట్లు తెలుస్తోంది. మృతుల్లో ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు ప్రమోద్ అలియాస్ పాండు ఉన్నారు. ఎన్ కౌంటర్ కు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కాగా, ఛత్తీస్ గఢ్ లోని దండకారణ్యం గత కొన్ని రోజులుగా కాల్పుల మోతతో అట్టుడికిపోతోంది. ఇటీవలే బీజాపూర్ జిల్లాలోని నేషనల్ పార్క్ లో జరిగిన ఆపరేషన్ లో పదుల సంఖ్యలో మావోయిస్టులు మృతిచెందిన సంగతి తెలిసిందే. వారి మృతదేహాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఇది జరిగిన కొన్ని రోజులకే ఏకంగా పది మంది మావోయిస్టులను కోల్పోవడం పార్టీకి భారీ ఎదురుదెబ్బగా భావిస్తున్నారు.



# హైదరాబాద్-చెన్నై బుల్లెట్ ట్రైన్

మొదటి పేజీ తరువాయి

కమాండ్ కంట్రోల్ సెంటర్లో దక్షిణ మధ్య రైల్వే అధికారులతో పాటు, వివిధ విభాగాల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు.సమావేశానికి హాజరైన దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్కుమార్ శ్రీవాస్తవను ముఖ్యమంత్రి స్వాగతించారు. కొత్త ప్రాజెక్టులపై ఆయనతో ప్రత్యేకంగా చర్చించారు. సీఎంతో పాటు ఎంపీ కడియం కావ్య, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఆర్ అండ్ బీ స్పెషల్ సెక్రెటరీ వికాసరాజ్, సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీనివాసరాజు, ఆర్థిక శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఈ సమావేశంలో పాల్గొన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందరు పోర్టు వరకు గ్రీన్ ఫీల్డ్ హైవేతో పాటు అనుసంధానంగా రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్ర పునర్విభజన చట్టంలోని హామీ ప్రకారం హైదరాబాద్ నుంచి అమరావతికి ర్యాపిడ్ రైల్ అండ్ రోడ్డు కనెక్టివిటీ ప్రాజెక్టును కేంద్రం అమలు చేయాల్సి ఉందన్నారు.కొత్తగా ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందర్ వరకు 12 లేన్ల గ్రీన్ ఫీల్డ్ హైవే ఏర్పాటు చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశామని, అందుకు సంబంధించి 300 కిలోమీటర్ల అలైన్మెంట్ ప్రతిపాదనలను కూడా రాష్ట్ర ప్రభుత్వం తయారు చేసిందన్నారు. దానికి అనుగుణంగా రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని, రైల్వే విభాగం పరిశీలనలో ఉన్న అలైన్మెంట్తో పాటు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేసిన అలైన్మెంట్ను పరిశీలించి భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ముందుకు వెళ్లాలని ముఖ్యమంత్రి సూచించారు. హైవే వెంట రైలుమార్గం ఉండాలని, హైవేకు ఇరువైపులా కిలోమీటర్నర దూరం వరకు ఇండస్ట్రియల్ కారిడార్ను విస్తరించాలనే ప్రతిపాదనలున్నాయని చెప్పారు. కొత్తగా అభివృద్ధి చేస్తున్న గ్రీన్ఫీల్డ్ హైవే ప్రతిపాదనలకు అనుగుణంగా హైదరాబాద్–చెన్నై, హైదరాబాద్–బంగుళూరు హైస్పీడ్ రైలు ప్రాజెక్టుల సర్వే, అలైన్మెంట్ ప్రతిపాదనలను మరోసారి పరిశీలించాలని ముఖ్యమంత్రి రైల్వే అధికారులకు సూచించారు.హైదరాబాద్ చుట్టూ రీజనల్ రింగ్ రైల్ ఆవశ్యకతను ముఖ్యమంత్రి అధికారులకు వివరించారు. దాదాపు 362 కిలోమీటర్ల మేరకు రీజనల్ రింగ్ రోడ్డు వెంట రింగ్ రైలు ఏర్పాటు చేయటంతో హైదరాబాద్ మహా నగరం భవిష్యత్తు స్వరూపం మారిపోతుందన్నారు. వీలైనంత తొందరగా ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని రైల్వే అధికారులకు సీఎం సూచించారు. తెలంగాణ ఇండస్ట్రియల్ సెక్టార్ కోసం ప్రత్యేక రైల్వే లైన్ ఉండేలా ఈ కనెక్టివిటీ ఉండాలని సీఎం అభిప్రాయపడ్డారు. వికారాబాద్- కృష్ణా కొత్త రైల్వే లైన్ పనులను వీలైనంత త్వరగా చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. దీంతో పాటు గద్వాల–డోర్నకల్ రైల్వే లైన్ పనుల డీపీఆర్ పూర్తి చేసి వేగంగా చేపట్టాలన్నారు. వరంగల్లోనూ రైల్వే లైన్లను అభివృద్ధి చేయాలని, భూపాలపల్లి నుంచి వరంగల్ కొత్త మార్గాన్ని పరిశీలించాలని సూచించారు. కాజీపేట జంక్షన్లో ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాలని అన్నారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా హైదరాబాద్తో పాటు వరంగల్ను అభివృద్ధి చేయాలని, అందుకు అనుగుణంగా రైల్వే ప్రాజెక్టులను చేపట్టాలని ముఖ్యమంత్రి రైల్వే అధికారులకు సూచించారు.

# నేపాల్ తాత్కాలిక ప్రధానిగా కుల్మన్ ఘీసింగ్

**ఖాట్మండు:** కేపీ శర్మ ఓలి పదవి నుంచి తప్పుకున్న తర్వాత నేపాల్ విద్యుత్ అథారిటీ మాజీ మేనేజింగ్ డైరెక్టర్ కుల్మన్ ఘీసింగ్ నేపాల్ తాత్కాలిక ప్రధానమంత్రిగా నియమితులయ్యారు. ఎక్స్, ఫేస్ బుక్ సహా సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ లను నిషేధించాలనే ప్రభుత్వం నిర్ణయం తర్వాత రెండు రోజుల పాటు జనరల్ జెడ్ నేతృత్వంలో జరిగిన తీవ్ర నిరసనల తర్వాత కేపీ శర్మ ఓలి మంగళవారం పదవీవిరమణ చేశారు. సోమవారం ఆంక్షలు ఎత్తివేయబడినప్పటికీ, దేశవ్యాప్తంగా ప్రదర్శనలు ఇప్పటికే పెరిగాయి. అధికార వర్గాల సమాచారం ప్రకారం, నిరసనకారులు తాత్కాలిక నాయకత్వానికి మాజీ ప్రధాన న్యాయమూర్తి సుశీలా కర్కి, ఖాట్మండు మేయర్ బాలేంద్ర షా, స్వయంగా ఘిసింగ్ వంటి అనేక పేర్లను సూచించారు. మాజీ ప్రధాన న్యాయమూర్తి కర్కి కూడా ఈ రోజు ప్రారంభంలో నేపాల్ ఆర్మీ చీఫ్ తో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం.నేపాల్ తాత్కాలిక ప్రధానమంత్రి పదవికి ముందు వరుసలో నిలిచిన 54 ఏళ్ల కుల్మాన్ ఘిసింగ్, ఆ దేశ విద్యుత్ బోర్డు మాజీ అధిపతి. ఖాట్మండు లోయలో దీర్ఘకాలిక లోడ్-షెడ్డింగ్ ను తొలగించడం ద్వారా ఆయన విస్తృత గుర్తింపు పొందారు. నవంబర్ 25, 1970న రామెచాప్ లోని బెథాన్ లో జన్మించిన ఘిసింగ్, భారతదేశంలోని జంషెడ్ పూర్ లోని రీజినల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ చదివాడు. తరువాత నేపాల్ లోని పుల్ చౌక్ ఇంజనీరింగ్ కాలేజీలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ చదివాడు. తన నాయకత్వ నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి ఎంబీఏ చదివాడు. మార్చి 2025లో నేపాల్ ప్రభుత్వం నేపాల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ కుల్మాన్ ఘిసింగ్ ను తన పదవి నుంచి తొలగించింది.ఘిసింగ్ తన స్వతంత్ర విధానం పట్ల అసంతృప్తి చెందిన ఇంధన, జల వనరులు, నీటిపారుదల మంత్రి దీపక్ ఖడ్కాతో విభేదించారు. ప్రభుత్వం మొదటగా అతన్ని సెప్టెంబర్ 14, 2016న నాలుగు సంవత్సరాల కాలానికి ఈ పదవికి నియమించింది. ఘిసింగ్ ఆగస్టు 11, 2021న ఎన్ఈఏ మేనేజింగ్ డైరెక్టర్ గా తిరిగి నియమితులయ్యారు. ఘోరమైన నిరసనల మధ్య, ఘీసింగ్ స్వచ్ఛమైన పలుకుబడి ఉన్న వ్యక్తులతో కూడిన తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని, జనరేషన్-జెడ్ యువతను చేర్చుకోవాలని, తక్షణ ఎన్నికలను ప్రకటించాలని పిలుపునిచ్చారు. నిరసన తెలుపుతున్న జనరల్ జెడ్ గ్రూప్ తాత్కాలిక ప్రభుత్వానికి నాయకత్వం వహించడానికి ఘిసింగ్ పేరును పరిగణించింది. నేపాల్ ప్రధానమంత్రి పదవికి కె.పి. శర్మ ఓలి రాజీనామా చేసినప్పటి నుండి ఈ వారం 30 మంది మృతి చెందిన ఘోరమైన నిరసనల నేపథ్యంలో ఆ దేశ నాయకుడి గురించి ఊహాగానాలు చెలరేగాయి.

# తెలంగాణలో కమ్యూనిస్టులది త్యాగాల చరిత్ర

**కరీంనగర్ ,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అసువులు బాసిన అమర వీరుల కోసం హైదరాబాద్ లో స్మృతివనం ప్రభుత్వమే ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశాడు. తెలంగాణలో కమ్యూనిస్టులది త్యాగాల చరిత్ర అని,సాయుధ రైతాంగ పోరాటాన్ని వక్రీకరిస్తే బిజెపికి ప్రజలే తగిన గుణపాఠం చెప్పక తప్పదని వెంకటరెడ్డి హెచ్చరించారు. సెప్టెంబర్ 11 నుంచి 17 వరకు రాష్ట్రవ్యాప్తంగా సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలలో భాగంగా సిపిఐ కరీంనగర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో లో గురువారం ఘనంగా వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. కొతీరాంపూర్ బైపాస్ రోడ్డులో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిన అగ్ర నేతల్లో ఒకరైన బద్దం ఎల్లారెడ్డి విగ్రహానికి సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ తో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం బద్దం ఎల్లారెడ్డి విగ్రహం నుంచి సిపిఐ కోతిరాంపూర్, కమాన్,బస్టాండ్,తెలంగాణ చౌక్ మీదుగా వెంకటేశ్వర టెంపుల్ ముందు గల అనభేర్ ప్రభాకర్ రావు విగ్రహం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించి అనభేరి విగ్రహానికి పూలమాల వేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరులను స్మరిస్తూ కార్యకర్తలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ వెట్టి చాకిరీ విముక్తి కోసం, బానిసత్వానికి వ్యతిరేకంగా,ఆకలి మంటలు,ఆర్థనాదాలు, అణచివేతలకు వ్యతిరేకంగా, భూమికోసం భుక్తి కోసం దాస్య శృంఖాలాల విముక్తి కోసం పుట్టిందే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమని పేర్కొన్నారు.భారతదేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వస్తే నిజాం నవాబుల పరిపాలనలో కొనసాగుతున్న హైదరాబాద్ రాష్ట్రానికి (తెలంగాణకు) స్వాతంత్ర్యం రాలేదని,దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ఎంతో మంది కమ్యూనిస్టులు పోరాటం చేశారని, హైదరాబాద్ సంస్థానాన్ని పరిపాలిస్తున్న నిజాం నవాబుల, దేశ్ ముఖ్లు, రజాకార్ల




చేతిలో చితికి పోతున్న ప్రజల మాన,ప్రాణాలను కాపాడుకోవడం కోసం నిజాం పరిపాలన అంతం కోసం 1947 సెప్టెంబర్ 11న తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి బద్ధం ఎల్లారెడ్డి, రావినారాయణరెడ్డి, మక్దుం మొయుద్దీన్ లు పిలుపునిచ్చారని వారి పిలుపుతో వేలాది గ్రామాలలో లక్షలాదిమంది సాయుధ పోరాటానికి ముందుకు వచ్చారని, అనేక గ్రామాల్లో ప్రజలను చైతన్య పరుస్తూ ఎన్నో సంఘాలు నిర్మించి నిజాం రజాకార్ పోలీసులకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు వీరోచిత పోరాటాలు చేశారన్నారు. వెట్టిచాకిరీ రద్దు చేయాలని, బానిసత్వం పోవాలని,దున్నే వాడికే భూమి వంటి నినాదాలతో అనేక కార్యక్రమాలతో ఊరువాడ ఉప్పెనలా ఉద్యమించారని గుర్తు చేశారు.వీరోచితంగా సాగిన ఆ మహత్తర పోరాటంలో 3,000 గ్రామాలు విముక్తి కాబడి, 4500 మంది కమ్యూనిస్టులు ప్రాణ త్యాగం చేశారని,10 లక్షల ప్రభుత్వ భూములను పేదలకు పంచిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీకి ఉందని వెంకటరెడ్డి తెలిపారు. కమ్యూనిస్టులు నిర్వహిస్తున్న సాయుధ పోరాటం మరింత ఉధృతమవుతున్న తరుణంలో నైజాం నవాబు ఆనాటి కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి 1948 సెప్టెంబర్ 17న భారతదేశంలో హైదరాబాద్ సంస్థానాన్ని విలీనం చేయడం జరిగిందన్నారు. బిజెపి నేతలు తెలంగాణ విమోచన దినమంటూ,కాంగ్రెస్ నేతలు సమైఖ్యత దినోత్సవమంటూ చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నారన్నారు.అది ముమ్మాటికీ తెలంగాణ విలీన దినోత్సవమేనన్నారు.చరిత్రను వక్రీకరించే నాయకుల్లారా ఖబర్దార్ అని హెచ్చరించారు.తెలంగాణ సాయుధ పోరాట అమరవీరుల కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలన్నారు. 4500 మంది ప్రాణాలు పోగొట్టుకున్న త్యాగాల చరిత్ర కమ్యూనిస్టు పార్టీకి మాత్రమే ఉందన్నారు. హైదరాబాద్ లో అమరవీరుల కోసం స్మృతి వనంతో పాటు రైతాంగ సాయుధ పోరాటంలో ఎన్ కౌంటర్లు జరిగిన స్థానంలో వారి స్మారక స్మృతి,వనాలతో పాటు స్థూపాలు ఏర్పాటు చేయాలని వెంకటరెడ్డి ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కరీంనగర్ జిల్లా పాత్ర కీలకంగా ఆనాడు ఉందనీ, ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన అగ్ర నేత బద్దం ఎల్లారెడ్డి తో పాటు అనభేరి ప్రభాకర్ రావు, సింగిరెడ్డి భూపతి రెడ్డి లాంటి ఎంతోమంది గొప్ప నేతలు సాయుధ పోరాటంలో కీలక భూమిక పోషించారని, ఈ ప్రాంత ప్రజల కోసం తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా అసువులు బాసిన అమరవీరుల ఆశయాలను లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లేందుకు సిపిఐ శ్రేణులు కంకణ బద్దులు కావాల్సిన అవసరం ఉందని అమరులు చూపిన బాటలో నడుస్తూ జిల్లాలో కమ్యూనిస్టు పార్టీ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయడం కోసం అహర్నిశలు కృషి చేస్తూ తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్,రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అందె స్వామి,పొనగంటి కేదారి, కసిరెడ్డి మణికంఠ రెడ్డి,జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్,కసిరెడ్డి సురేందర్ రెడ్డి, బోయిని అశోక్,గూడెం లక్ష్మీ,నాగెల్లి లక్ష్మారెడ్డి, బోయిని తిరుపతి,పిట్టల సమ్మయ్య,వివిధ మండలాల కార్యదర్శులు బండ రాజిరెడ్డి,గోవిందుల రవి, చొక్కల్ల శ్రీశైలం,లంకదాసరి కల్యాణ్,ఉమ్మెంతల రవీందర్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్,పైడిపల్లి రాజు,న్యాలపట్ల రాజు,మచ్చ రమేష్ బావండ్లపెల్లి యుగేందర్,కంది రవీందర్ రెడ్డి, చాడ శ్రీధర్ రెడ్డి,అందె చిన్న స్వామి, బోయిని సర్దార్ వల్లభాయ్ పటేల్,బీర్ల పద్మ, కొట్టే అంజలి,కాంతాల శ్రీనివాస్ రెడ్డి,మావురపు రాజు, రామారాపు వెంకటేష్,పిట్టల శ్రీనివాస్,తేరాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

# సీఎం రేవంత్ మేడారం టూర్

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** మేడారంకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఈ పుణ్యక్షేత్రం అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేడారంలో ప్రకటించబోతున్నారు. ఈ నెల 13 లేదా 14న సీఎం రేవంత్ రెడ్డి మేడారంలో పర్యటించి అక్కడ గద్దెల ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలుస్తోంది. రెండు రోజుల క్రితం మేడారం, బాసర ఆలయాల అభివృద్ధిపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన సీఎం.. మహా జాతర సమయానికి భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. రానున్న 100 రోజుల్లోగా మేడారం అభివృద్ధి పనులు పూర్తి కావాలని అందుకోసం ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని జంపన్న వాగులో నీరు నిల్వ ఉండేలా చెక్ డ్యామ్ ల నిర్మాణాలు చేపట్టాలని ఆదేశించారు. ఈ వారంలో తానే స్వయంగా మేడారంలో పర్యటించి క్షేత్రస్థాయి పనులను పరిశీలిస్తానని చెప్పారు. ఈ మేరకు సీఎం మేడారం టూర్ ఖరారు అయినట్లు సమాచారం.

# కవితకు కేసీఆర్ గ్రామస్తుల ఆహ్వానం



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కు కేసీఆర్ స్వగ్రామం చింతమడకకు రావాలని ఆహ్వానం అందింది. చింతమడక లో ఈనెల 21న జరగబోయే ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలకు రావాలని కొంత మంది గ్రామస్తులు వచ్చిన కవితను ఆహ్వానించారు. కేసీఆర్ స్వగ్రామం నుండి కవితకు ఆహ్వానం అందడం ఆసక్తిక రంగా మారింది. కవితను బీఆర్ఎస్ బహిష్కరించిన సంగతి తెలిసిందే.చాలా కాలంగా కవిత పార్టీకి దూరంగా ఉండటంతో పాటు హరీష్ రావు, సంతోష్ రావుల పై ఆరోపణలు చేశారు. వాళ్లిద్దరూ తమ కుటుంబంపై కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఆ తరవాత బీఆర్ఎస్ నుండి ఆమెను సస్పెండ్ చేస్తున్నట్టు పార్టీ అధినేత కేసీఆర్ ప్రకటించారు. అయితే గతంలో బతుకమ్మ ఉత్సవాల్లో జాగృతి కీలకంగా వ్యవహరించిన సంగతి తెలిసిందే. బతుకమ్మ ఉత్సవాల సమయంలో కవిత అనేక ప్రాంతాలకు వెళ్లి మహిళలతో కలిసి ఆడేవారు. ప్రస్తుతం ఆ పార్టీలో లేనప్పటికీ కేసీఆర్ స్వగ్రామంలో జరిగే వేడుకలకు హాజరయ్యే అవకాశం ఉంది.

# గ్రూపు-1 ఇష్యూ.. టీజీపీఎస్సీ కీలక నిర్ణయం

TELANGANA STATE PUBLIC SERVICE COMMISSION
తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** గ్రూపు-1 నియమకాలపై అప్పీల్ కు వెళ్లాలని టీజీపీఎస్ సీ నిర్ణయించింది. తెలంగాణ హైకోర్టు సింగిల్ బెంచ్ తీర్పును డివిజన్ బెంచ్ లో అప్పీల్ చేయనుంది. వారం రోజుల్లో పిటిషన్ దాఖలు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇందుకోసం ఇప్పటికే న్యాయనిపుణులతో సంప్రదింపులు జరిపినట్లు తెలుస్తున్నది. గ్రూప్-1 పరీక్షల్లో ఇప్పటివరకు జరిగిన ప్రక్రియలను వివరించాలని భావిస్తున్నది. ఈ విషయంలో ఏ విధంగా ముందుకు వెళ్లాలనే అంశంపై పలువురు న్యాయ నిపుణలతో మాట్లాడిన్నట్టు తెలిసింది. గ్రూపు-1 నియామకాల్లో ఎలాంటి లోపాలు లేవని టీజీపీఎస్సీ మరోసారి స్పష్టం చేసింది.


ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి 7730032999 flashindiadaily@gmail.com

# ఉద్యోగాల దొంగలెవరో తేల్చాల్సిందే

**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** గ్రూప్ -1 మూల్యాంకనం, ర్యాంకింగ్ లిస్ట్ పై తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. మార్చి 10న ఇచ్చిన ఫలితాల ఆధారంగా ప్రకటించిన జనరల్ ర్యాంకింగ్ లిస్ట్ , మార్కుల జాబితాను ఉన్నత న్యాయస్థానం రద్దు చేసింది. గతంతో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం రీ వాల్యుయేషన్ చేపట్టాలని టీజీపీఎస్సీని ఆదేశించింది.ఈ నేపథ్యంలోనే గ్రూప్-1 అంశంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ 'X' (ట్విట్టర్) వేదికగా సంచలన ట్వీట్ చేశారు. సర్కారు కొలువు కోసం ఏళ్ల తరబడి కష్టపడి తమ విలువైన సమయాన్నీ, అమ్మనాన్నల కష్టార్జితం బూడిదలో పూసిన పన్నీరైందని కామెంట్ చేశారు. పోటీ పరీక్షలు రాసే తెలంగాణ యువత నమ్మకాన్ని కాంగ్రెస్ సర్కార్ వమ్ముజేసిందని అన్నారు. అసమర్థత, కాసుల కక్కుర్తి కలగలిసి అనేక అవకతవకలకు కారణమయ్యిందని కేటీఆర్ ధ్వజమెత్తారు.అంగట్లో కొలువులు అమ్ముకొని నిరుద్యోగుల గొంతు కోశారని కేటీఆర్ రేవంత్ ప్రభుత్వంపై ఆరోపణలు గుప్పించారు. గ్రూప్-1 పరీక్ష నిర్వహణలో ఫెయిల్ అయిన ఈ ప్రభుత్వాన్ని యువత ఎన్నటికీ క్షమించదని స్పష్టం చేశారు. హైకోర్టు ఆదేశించినట్లుగా గ్రూప్-1 పరీక్ష మళ్లీ తాజాగా నిర్వహించాలి, అవకతవకలపై జుడీషియల్ కమీషన్ వేసి ఉద్యోగాల దొంగలెవరో తేల్చాలన్నారు. ఏడాదిలోపే రెండు లక్షల ఉద్యోగాలిస్తామని కాంగ్రెస్ చేసిన మోసపూరిత వాగ్దానంపై ప్రత్యేక అసెంబ్లీ సెషన్ ఏర్పాటు చేసి చర్చించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# యూరియా కోసం రైతులు ఆందోళన చెందొద్దు

- యూరియా కోసం రైతులు ఆందోళన చెందొద్దు
- తెలంగాణకు సరిపడా యూరియా ఇవ్వాలని కేంద్రాన్ని విజ్ఞప్తి చేశాం
- ప్రజా పాలన ప్రభుత్వంలో సంక్షేమం,అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నాం
- సైదాపూర్ మండలంలో అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్



**సైదాపూర్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణకు సరిపడా యూరియా ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశాం, యూరియా కోసం రైతులు ఆందోళన చెందవద్దని, ప్రజా పాలన ప్రభుత్వంలో సంక్షేమం,అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నామని బిసి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం సైదాపూర్ మండలంలోని ఆకునూరు గ్రామంలో కేజీబీవి పాఠశాలలో 90 లక్షలతో డార్మెంటరీ హాల్, భవన మరమ్మత్తులు, మురికి కాలువల నిర్మాణానికి శంకుస్థాపన, రూ.5 లక్షలతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ ను ప్రారంభించారు. అనంతరం మహిళా సంఘాలకు స్టీల్ బ్యాంక్ పంపిణీ చేశారు. అలాగే వేంకటేశ్వర్లపల్లి గ్రామంలో రూ.5 లక్షలతో నూతనంగా నిర్మించిన ఓపెన్ జిమ్ ప్రారంభించారు. సోమారం గ్రామ పంచాయతీ పరిధిలోని బూడిదపల్లి గ్రామంలో రూ.5 లక్షలతో ఓపెన్ జిమ్ ప్రారంభించారు. రూ.12 లక్షలతో నూతన అంగన్వాడీ భవన నిర్మాణానికి భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. మహిళా సంఘాలకు స్టీల్ బ్యాంక్ పంపిణీ చేశారు. ఎక్లాస్పూర్ రూ. 20 లక్షలతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. మహిళా సంఘాలకు స్టీల్ బ్యాంక్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్ ,మార్కెట్ కమిటీ చైర్మన్ దొంత సుధాకర్, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్లకు లైన్ క్లియర్..

- పంచాయతీ రాజ్, మున్సిపల్ చట్ట సవరణ బిల్లుకు గవర్నర్ ఆమోదం

**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** ఎట్టకేలకు స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కు లైన్ క్లియర్ అయింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం చట్ట సభల్లో ఆమోదించిన పంచాయతీ రాజ్, మున్సిపల్ చట్ట సవరణ బిల్లుకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదం తెలిపారు. అదేవిధంగా ఇప్పటి వరకు 50 శాతం రిజర్వేషన్ల క్యాప్ ను ఎత్తివేస్తూ నిర్ణయం తీసుకున్నారు. గెజిట్ నోటిఫికేషన్ విడుదలకు కూడా గవర్నర్ అనుమతిని ఇచ్చిన నేపథ్యంలో త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడనుంది.కాగా, రాష్ట్రంలో గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్ లు, పురపాలికలు, నగరపాలక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని ఎత్తివేసి... బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచేందుకు ఉద్దేశించిన పంచాయతీరాజ్, పురపాలక చట్టాల సవరణ బిల్లులు రెండింటిని సెప్టెంబర్ 2న రాజ్ భవన్ కు పంపిన విషయం తెలిసిందే. ఆగస్టు 31న అసెంబ్లీ లో, సెప్టెంబర్ 1న శాసన మండలిలో ఆ రెండు బిల్లులు ఆమోదం పొందాయి. ఈ క్రమంలోనే గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తన వద్దకు వచ్చిన రెండు బిల్లులపై లీగల్ ఒపీనియర్ తీసుకుని రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని ఎత్తివేత బిల్లు, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లు ఆమోదం తెలిపారు. ఇవాళ లేదా రేపు గెజిట్ నోటిఫికేషన్ నోటిఫికేషన్ వెలువడనుంది.

# ఇండియా కూటమిలో క్రాస్ ఓటింగ్ చిచ్చు..

**ఢిల్లీ :** ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ అంశం జాతీయ రాజకీయాల్లో సంచలనంగా మారింది. ఎన్డీఏ కూటమి అభ్యర్థి సి.పి రాధాకృష్ణన్ కు 452 ఓట్లు, ఇండియా కూటమి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డికి 300 ఓట్లు పడ్డాయి. ఎన్డీయే కూటమి వాస్తవ సంఖ్యా బలం కంటే 14 ఓట్లు ఎక్కువ రావడంతో ప్రతిపక్ష కూటమిలో క్రాస్ ఓటింగ్ జరిగిందనే వాదన బలపడుతోంది. ఈ నేపథ్యంలో ఈ అంశంపై విపక్షాల అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డి స్పందించారు. క్రాస్ ఓటింగ్ పై నేను మాట్లాడనని దేశ ప్రజలందరూ చూశారన్నారు. తాజాగా ఓ న్యూస్ చానల్ తో మాట్లాడిన ఆయన పార్టీల్లో చేరి పదవుల కోసం పాకులాడే అవసరం తనకు లేదన్నారు. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఓట్లు చెల్లకపోవడం ఆశ్చర్యం కలిగించిందన్నారు.

**బిహార్ ఎన్నికల ముంగిట్లో ఇండియా కూటమిలో కుంపటి:**

త్వరలో బిహార్ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్న వేళ ఇండియా కూటమిలో క్రాస్ ఓటింగ్ అంశం కూటమి ఐక్యత మరోసారి ప్రశ్నార్థకంగా మారింది. ముఖ్యంగా టీఎంసీ ఆమ్ ఆద్మీని టార్గెట్ చేసింది. ఆర్జేడీ, జేఎంఎం, శివసేన యూబీటీ పార్టీల ఎంపీలపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. విపక్ష కూటమిలో క్రాస్ ఓటింగ్ పై చర్చ జరుగుతున్న వేళ కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు మనస్సాక్షితో ఓటు వేసిన ఇండియా బ్లాక్ ఎంపీలకు ప్రత్యేక కృతజ్ఞతలు అని కామెంట్ చేయడం పుండుమీద కారం చల్లిన చందంగా మారింది. బిహార్ ఎన్నికల్లో ఓడించడం ద్వారా ఎన్డీయేను దెబ్బకొట్టాలని రాహుల్ గాంధీ పట్టుదలతో ఉన్న నేపథ్యంలో ఇండియా కూటమిలో ఉప రాష్ట్రపతి పోలింగ్ కొత్త చిక్కు తెచ్చి పెట్టినట్లైందనే చర్చ రాజకీయ వర్గాల్లో జరుగుతోంది.

**ఉపరాష్ట్రపతి ఎన్నికలోనూ ఓట్ల చోరీ**

ఉపరాష్ట్రపతి ఎన్నిక ల్లోనూ బీజేపీ ఓట్లను దొంగిలించిందని కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ సంచల న ఆరోపణలు చేశారు. దేశవ్యాప్తంగా బీజేపీ ఇదేపని చేస్తోందని, 'ఓట్ల దొంగ' వెంటనే గద్దె దిగాలని డిమాండ్ చేశారు. రాయబరేలీలో పర్యటించిన రాహుల్.. ఉపరాష్ట్ర పతి ఎన్నికల్లో 'ఇండియా' కూటమి నుంచి క్రాస్ ఓటింగ్ జరగడంపై మీడియా అడిగా న ప్రశ్నకు ఈ విధంగా స్పందించారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీఏ అభ్యర్థి రాధాక ష్ణన్ కు అనుకూలంగా 'ఇండియా' కూటమికి చెందిన పలువురు ఎంపీలు ఓటు వేయడం రాజకీయంగా ప్రకంపనలు సృష్టిస్తోంది. కూటమి ఉమ్మడి అభ్యర్థి సుదర్శన్ రెడ్డికి అనుకున్న దానికంటే తక్కువ ఓట్లు రావడంపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర అసంతృప్తి ఉంది. ఈ పరిణామం కూటమిలోని ఐక్యతపై నీలినీడలు కమ్ముకునేలా చేసింది.

# ఖర్గే మాటలు చూస్తే నవ్వొస్తుంది..

## అన్ని రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైంది

**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ బీజేపీ చీఫ్ రామచందర్ రావు, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని, రాజ్యాంగ నియమాలను ఉల్లంఘిస్తోందని ఆయన ఆరోపించారు. రామచందర్ రావు ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ, "మైక్ కూడా ప్రభుత్వంలాగే పనిచేస్తున్నట్టు ఉంది, అప్పుడప్పుడు చెప్పినట్టు వినదు" అంటూ చురకలు అంటించారు. ఆయన చేసిన ప్రధాన వ్యాఖ్యలు ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో జరిగిన క్రాస్ ఓటింగ్ ను చూస్తే ఇండియా కూటమిలో ఐక్యత లేదని తెలిపోయిందని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు జరిగినంత రాజ్యాంగ అవహేళన ఎప్పుడూ జరగలేదని ఆయన విమర్శించారు. గవర్నర్ మాత్రం రెండు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని ఆదేశాలు ఇస్తారని, కానీ స్పీకర్ మాత్రం పిరాయింపుల పైన నిర్ణయం తీసుకోవడానికి గడువు ఉండదా అని కాంగ్రెస్ ను ప్రశ్నించారు.యూరియా కృత్రిమ కొరతను కాంగ్రెస్ సృష్టించిందని, రాష్ట్ర ప్రభుత్వమే దీనికి కారణమని తెలంగాణ రైతులకు అర్థమైందని రామచందర్ రావు పేర్కొన్నారు. తెలంగాణకు అవసరమైన యూరియాను కేంద్రం ఎప్పుడో ఇచ్చిందని, కొద్దిగా ఆలస్యం కావొచ్చు కానీ కొరత లేదని ఆయన స్పష్టం చేశారు. బీఆర్ ఎస్ లో కుటుంబ తగాదాలు ఉన్నాయని, కానీ బీఆర్ ఎస్, కాంగ్రెస్ ల మధ్య తగాదా లేదని అన్నారు. ఓయూకి వెయ్యి కోట్లు ఇస్తానని సీఎం అన్నారని, కానీ ఇప్పుడు ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు కూడా రావడం లేదని ఆరోపించారు.పార్టీలో ఎవరిపైనా వివక్ష లేదని, ఇంకా 650 పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆయన చెప్పారు. పార్టీ కమిటీలో అందరికీ అవకాశం రాలేదని, వారి సేవలను ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తామని అన్నారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఓటింగ్ లో పాల్గొంటే, ఉన్న నలుగురు సభ్యులు కూడా ఉంటారో లేదో అనే భయంతోనే బీఆర్ ఎస్ ఓటింగ్ కు దూరంగా ఉందని ఎద్దేవా చేశారు.

**గ్రూప్-1 అభ్యర్థుల పరిస్థితి చూస్తే బాధ కలుగుతోంది**

కాంగ్రెస్ లో విధాన పక్షవాతం ఎప్పటినుంచో ఉందని, తెలంగాణ రాష్ట్రంలో పరిపాలన పక్షవాతం నెలకుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అన్నారు. తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ మీట్ ది ప్రెస్లో పాల్గొన్న రామచందర్ రారు కాంగ్రెస్ ప్రభుత్వంపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ లో ఇండియా కూటమికి ఐక్యత లేదని తెలిపోయిందన్నారు. గ్రూప్-1 అంశంలో న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందని గుర్తుచేశారు. జబ్ క్యాలెండర్ ఏమైంది? అని ప్రశ్నించారు.11 ఏళ్లుగా తెలంగాణలో కొత్తగా ఒక్క గ్రూర్-1 అధికారి కూడా నియామకం కాలేదని, గ్రూప్ వన్ అభ్యర్థుల పరిస్థితి చూస్తే ఎంతో బాధ కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విశ్రాంత ఉద్యోగులకు 18 నెలలుగా బెనిఫిట్స్ రావట్లేదని ఆరోపించారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రొఫెసర్లకు జీతాలు రావడం లేదని, యూనివర్సిటీలు హాస్టళ్లు అధ్వానంగా మారయని ఆరోపించారు. ఉస్మానియా యూనివర్సిటీలో పర్యటించిన రేవంత్ రెడ్డి వెయ్యి కోట్లు ఇస్తానని గొప్పలు చెప్పారని మండిపడ్డారు. దావోస్ పర్యటనకు వెళ్లి ఎన్ని కోట్ల పెట్టుబడులు తెచ్చారో అని ప్రశ్నించారు.

**ఓవరాల్ కాళేశ్వరం అప్పగించాలన్న స్టేట్ చీఫ్**

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతిని విచారించే బాధ్యతను రాష్ట్ర ప్ర భుత్వం సీబీఐకి అప్పగించింది. ఈ మేరకు కేంద్ర హోం మంత్రిత్వశాఖకు రాష్ట్ర ప్రభు త్వం లేఖ రాసింది. దీనిపై ఇప్పటి వరకు సీబీఐ నుంచి ఎలాంటి స్పందన రాలేదు. అయితే ఇదే తరుణంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు మాట్లాడుతూ సీబీఐకి ఓవరాల్ కాళేశ్వరంపై విచారణను అప్పగించాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా ఆ పార్టీ శాసన సభా పక్ష ఉప నేత పాయల్ శంకర్ నిన్న మాట్లాడుతూ.. బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒక్కటేనని, బీజేపీని బద్నాం చేసేందుకే కాళేశ్వరం కేసును సీబీఐకి అప్పగించారని అన్నారు. కాళేశ్వరం అవినీతిపై విచారణను సీబీఐకి అప్పగించాలని కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, స్టేట్ చీఫ్ రాంచందర్ రావు నిన్నటి వరకు మాట్లాడిన సంగతి విదితమే. ఇప్పుడు మాటమార్చడం హాట్ టాపిక్ గా మారింది. కాళేశ్వరం ప్రాజెక్టులో అం తర్భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లపైనే సుప్రీంకోర్టు మాజీ జస్టిస్ పినాకీ చంద్రఘోష్ నేతృత్వంలోని కమిషన్ విచారణ చేసింది. మే డిగడ్డ బ్యారేజీ కుంగిపోవడం, అన్నారం కూడా ప్రమాదకర స్థితికి చేరడంతో రాష్ట్రంలో అధికా రంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విచారణ ప్రారంభించింది. నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ నివేదికను, విజిలెన్స్ రిపోర్టును బేస్ చేసుకోవడం తోపాటు ఇందులో భాగస్వాములైన ప్రతి ఒక్కరి నీ ప్రశ్నించింది. అప్పటి సీఎం కేసీఆర్, అప్పటి నీటిపారుదల మంత్రి హరీశ్ రావు, అప్పటి ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ తోపాటు ఈఎ న్సీలను, వివిధ హోదాల్లో పనిచేసిన ఇంజినీర్లను, అధికారులను, నిర్మాణ సంస్థల ప్రతినిధులను. డిజైనింగ్ ఇచ్చిన వ్యాప్కోస్ సంస్థ ప్రతినిధులను విచారించింది. 665 పేజీలున్న ఈ రిపోర్టులో మాజీ సీఎం కేసీఆర్ పేరును ఏకంగా 266 సార్లు ప్రస్తావించడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. దీనిపై కేబినెట్ లో, అసెంబ్లీలో చర్చించిన ప్రభుత్వం కేసు విచారణను సీబీఐకి అప్పగిస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో అప్పటి వరకు సీబీఐకి అప్పగించాలని, కాంగ్రెస్, బీఆర్ఎ స్ ఒక్కటేనని విమర్శలు చేసిన కమలనాథులు అయోమయంలో పడిపోయారు. తొలుత సీబీఐకి అప్పగించడాన్ని స్వాగతిస్తూనే.. ఈ పని ఎప్పుడో చేయాల్సిందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. తాజాగా కమలనాథుల స్వరం మారింది. బీజేపీని బద్నాం చేసేందుకే కేసును సీబీఐకి అప్పగించార ని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అంటే.. స్టేట్ చీఫ్ రాంచందర్ రావు కూడా మాటమార్చి.. ఓవరాల్ కాళేశ్వరం విచారణను సీబీఐకి అప్పగించాలనే కొత్త పల్లవి ఎత్తుకున్నారు. విచారణ ప్రారంభిస్తే అన్ని విషయాలూ బయటికి వస్తాయ ని విశ్లేషకులు అంటున్నారు.

# వాళ్లు కావాలనే సరఫరా చేయడం లేదు..

- యూరియా పంపిణీపై మంత్రి సీతక్క ఫైర్

**కామారెడ్డి ,ఫ్లాష్ ఇండియా :** యూరియా కొరత పై విపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని మంత్రి సీతక్క అన్నారు. యూరియా కేంద్ర ప్రభుత్వం పరిధిలో ఉందన్నారు. కావాలనే బీఆర్ఎస్ నాయకులు రైతులను రెచ్చగొట్టి రోడ్లపై ధర్నా చేయిస్తున్నారని విమర్శించారు. నేడు కామారెడ్డిలో పర్యటించిన ఉమ్మడి జిల్లా ఇన్ ఛార్జి మంత్రి సీతక్క.. బీబీపేట, దోమకొండ, భిక్కనూరులో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతిపక్షాలపై ఫైర్ అయ్యారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒకటే.. కావాలనే యూరియాను సరఫరా చేయడం లేదని ఆరోపించారు. రైతులను పట్టించుకునే పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. అబద్దాల పునాదులపై బీఆర్ఎస్ పార్టీ బతుకుతుందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు పబ్లిక్ లో నుంచి వచ్చారని... ఫార్మ్ హౌస్ లో నుంచి అమెరికా నుంచి వచ్చిన వారు కాదన్నారు. ఈనెల 15న కామారెడ్డిలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. బీసీ బిల్లు ఆమోదించాలని కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.మరోవైపు.. రాష్ట్రంలో రైతులకు యూరియా కష్టాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఒక్క బస్తా యూరియా దొరికినా మహాభాగ్యం అనుకుంటూ రాత్రి, పగలు క్యూలైన్లలో అన్నదాతలు నిరీక్షిస్తున్నారు. కొన్నిచోట్ల ఓపిక నశించి ఆందోళనలకు దిగుతున్నారు. రైతు వేదికల ఎదుట యూరియా టోకెన్ల కోసం పడిగాపులు కాస్తున్నారు. సకాలంలో యూరియా పంపిణీ చేయకపోవడంతో వ్యవసాయ మార్కెట్ ఎదుట ఆందోళన చేస్తున్నారు.

# వారి సేవలను స్మరించుకుందాం..



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అటవీ శాఖ అధికారుల త్యాగం చిరస్మరణీయమని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. నెహ్రూ జువాలాజికల్ పార్క్ లో గురువారం అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 11వ తేదీన "అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవంగా" జరుపుకోవాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. అందులో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో కూడా ప్రతి సంవత్సరం ఈ రోజున "అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం జరుపుకుంటున్నాం అన్నారు. 1730 వ సంవత్సరములో రాజస్థాన్ రాష్ట్రంలో బిష్ణోయి తెగకు చెందిన 360 మంది కేజ్రి చెట్లను రక్షించేందుకు తమ ప్రాణ త్యాగం చేశారని మంత్రి తెలిపారు.అటవీ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా విధినిర్వహణలో వన సంపద సంరక్షణ కొరకు జీవితములను త్యాగం చేసిన అటవీ సిబ్బంది సేవలను స్మరించుకుంటున్నామన్నారు . తెలంగాణ రాష్ట్రంలో 1984వ సంవత్సరం నుండి ఇప్పటివరకు 22 మంది అటవీ సిబ్బంది ధైర్య సాహసాలతో అంకిత భావంతో పనిచేసే అటవీ నేరాలకు పాల్పడిన నేరస్తులను పట్టుకోవడంలో తమ అమూల్యమైన ప్రాణాలు అర్పించారని గుర్తు చేశారు. అటవీ రక్షణ లో భాగంగా 2014 నుంచి 2025 జూలై మాసం వరకు టేకు అలాగే మారు జాతి కలపకు సంబంధించిన కేసులు, 10375 అటవీ భూ ఆక్రమణ కేసులను కూడా నమోదు చేయడం జరిగిందని అన్నారు. 2025 సంవత్సరంలో రూ. 149.66 కోట్ల కలపకు గాను 96,813 కేసులు నమోదు చేసి రూ 51.50 కోట్ల జరిమానా వసూలు చేయడం జరిగిందని, 18002 వాహనాలను కూడా స్వాధీన పరచుకోవడం జరిగిందని అన్నారు.నేరస్తులు తెలియని కేసులు 29,858 నమోదు చేసి రూ. లు 67.13 కోట్ల విలువ కలిగిన టేకు , మారు జాతి కలపను స్వాధీనపరచుకొని జప్తు చేయడం జరిగిందని , 174 బేస్ క్యాంపులు, 62 చెక్ పోస్టులను ఏర్పాటు చేశామన్నారు . అడవుల సంరక్షణకు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత కొత్తగా 2,118 వాహనాలు అటవీ అధికారులకు అందించామని వెల్లడించారు. 2022 సంవత్సరంలో 1516 పోస్టుల భర్తీకి అనుమతి ఇచ్చిందని, ఇందులో 1393 మంది ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, 15 మంది ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు, 18 మంది ఏ సి ఎఫ్ ఇతర పోస్టులు రిక్రూట్ మెంట్ ప్రక్రియలోఉన్నాయని పేర్కొన్నారు. అనంతరం అటవీ అమరవీరుల స్మరించుకుంటూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డిజిపి డాక్టర్ జితేందర్, ప్రిన్సిపల్ సెక్రటరీ నదీమ్ అహ్మద్, పిసిసిఎఫ్ హెడ్ సువర్ణ, పిసిసిఎఫ్ వైల్డ్ లైఫ్ ఏలు సింగ్ మేరు, సి సి ఎఫ్ ప్రియాంక వర్గీస్, జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, వివిధ విభాగాల అధికారులు ఘనంగా నివాళులర్పించారు.

# ఇండియా-ఆఫ్రికా సీడ్ సమ్మిట్ 2025




**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ లో నిర్వహించిన ఇండియా—ఆఫ్రికా సీడ్ సమ్మిట్ 2025 లో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు గారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ సమ్మిట్ భారత్—ఆఫ్రికా దేశాల మధ్య వ్యవసాయరంగంలో సంబంధాలను బలోపేతం చేసే వేదికగా ఈ సమ్మిట్ నిలుస్తోందని పేర్కొన్నారు. ఈ సమ్మిట్ కేవలం వాణిజ్యంపై కాకుండా, సీడ్ డిప్లొమసీ ద్వారా విశ్వాసాన్ని పెంపొందించడం, శాస్త్ర పరిజ్ఞానం పంచుకోవడం, సుస్థిరమైన వ్యవసాయం నకు భవిష్యత్తులో పరస్పరం కలిసి పనిచేయడం కోసం ఈ వేదిక ఒక వారధిగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.భారతదేశం గ్రీన్ రివల్యూషన్ ద్వారా ప్రపంచంలోనే తొలిసారిగా ఆహార ధాన్యాలలో స్వయం సమృద్ధి సాధించిందని, ఆ విజయానికి మూలం నాణ్యమైన విత్తనం అని, నాణ్యమైన విత్తనమే లేకపోతే పంట లేదు అలాగే రైతు ప్రగతి సాధ్యం కాదు అని అన్నారు. ఆఫ్రికా ఖండంలో ప్రధానంగా మొక్కజొన్న, జొన్న, సజ్జ వంటి పంటలు పండుతున్నప్పటికీ, అనేక మంది రైతులు ఇప్పటికీ వాళ్లు దాచుకొన్న పంటలో కొంత ధాన్యాన్ని విత్తనముగా వాడుతున్నారు అని , ఇది ఉత్పాదకతను తగ్గించే అంశమని తెలిపారు. ఆఫ్రికా దేశాలకు సస్యశ్యామలమైన నేలలు, అనుకూల వాతావరణం ఉన్నందున సరైన సమయంలో సరైన విత్తనం అక్కడ రైతులకు అందించడం అత్యవసరమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర విత్తన ఉత్పత్తి సామర్థ్యాన్ని వివరించిన మంత్రి గారు — "తెలంగాణ భారతదేశపు సీడ్ హబ్ గా మారిందని, దేశ అవసరాల్లో 60% విత్తనాన్ని తెలంగాణ నుంచే సరఫరా చేయడమే కాకుండా, 20కి పైగా దేశాలకు ఎగుమతి చేస్తున్నామని అన్నారు. 1000కు పైగా విత్తన కంపెనీలు, ఆధునిక పరిశోధన, ప్రాసెసింగ్, నిల్వ సదుపాయాలతో పాటు కఠినమైన నాణ్యతా ప్రమాణాలు పాటించడం వల్ల తెలంగాణ విత్తనాలకు గ్లోబల్ గుర్తింపు లభించిందని అన్నారు.అలాగే, రాష్ట్రంలో అమలు చేస్తున్న రైతు భరోసా (పంటలకు పెట్టుబడి మద్దతు) విధానాన్ని వివరించారు. రైతుల ఖాతాలో నేరుగా సబ్సిడీ జమ చేయడం ద్వారా, రైతు తనకు నచ్చిన నాణ్యమైన విత్తనాన్ని కొనుగోలు చేసుకునే అవకాశాన్ని కల్పిస్తున్నామని, ఈ విధానం ద్వారా పారదర్శకత పెరిగి, రైతును శక్తివంతంగా మార్చడానికి దోహదం చేస్తుందని తెలిపారు. ఆఫ్రికా దేశాలు కూడా ఇలాంటి విధానాన్ని పరిగణనలోకి తీసుకుంటే, నాణ్యమైన విత్తనాల వినియోగం పెరిగి ఉత్పాదకత, ఆహార భద్రత గణనీయంగా మెరుగుపడుతుందని సూచించారు.అలాగే ఆఫ్రికా విత్తన మార్కెట్ విలువ దాదాపు USD 3.99 బిలియన్ గా ఉందని, భారత్—ఆఫ్రికా భాగస్వామ్యం ద్వారా ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ, రైతులు, పరిశోధకులు, విత్తన సంస్థలు కలిసి లాభపడవచ్చని అభిప్రాయపడ్డారు. చివరిగా, ఈ సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించిన ఇండియన్ చాంబర్ ఆఫ్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ (ICFA), ఆఫ్రికన్ సీడ్ ట్రేడ్ అసోసియేషన్ (AFSTA) మరియు ఇతర భాగస్వామ్య సంస్థలకు మంత్రి గారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ దేశాల నుండి, ప్రభుత్వ, ప్రైవేట్ రంగ ప్రతినిధులు పాల్గొన్నారు.

# కేటీఆర్‌కు అరుదైన గౌరవం



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కు అరుదైన గౌరవం లభించింది. గ్రీన్ లీడర్ షిప్ -2025 అవార్డుకు కేటీఆర్ ఎంపికయ్యారు. అమెరికాలోని న్యూయార్క్ లో ఈ అవార్డును కేటీఆర్ అందుకోనున్నారు. సెప్టెంబర్ 24న న్యూయార్క్ నగరంలో 9వ NYC గ్రీన్ స్కూల్ కాన్ఫరెన్స్ లో ప్రదానోత్సవం జరుగనుంది. సుస్థిర పాలన, పర్యావరణ పరిరక్షణలో ఆయన చేసిన కృషికి గాను ప్రతిష్టాత్మకమైన 'గ్రీన్ లీడర్ షిప్ అవార్డు 2025కు కేటీఆర్ ఎంపికయ్యారు.




# ఇదీ నేపాల్ చరిత్ర..

18వ శతాబ్ది చివర, 19వ శతాబ్ది ప్రారంభంలో గూర్ఖా ఐడెంటిటీ ఉద్యమం ఎంతగా ప్రభావం చూపిందంటే, అది అన్ని ఇతర ఐడెంటిటీ ఉద్యమాలను, ప్రాంతాలను ఏకం చేసి హిమాలయాల ఒడిలో నేపాలీ దేశానికి పునాది వేసింది.భారత్, చైనావంటి భారీ, శక్తివంతమైన దేశాల పొరుగున ఉన్న ఈ దేశంలో ఎవరెస్ట్ సహా ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన శిఖరాలలో 8 శిఖరాలు ఉన్నాయి. నేపాల్ లో దీనిని 'సాగరమాత' అని పిలుస్తారు.భారత్, నేపాల్ మధ్య 1751 కిలోమీటర్ల పొడవైన సరిహద్దు ఉంది. ఈ దేశం భారత్ లోని సిక్కిం, పశ్చిమ బెంగాల్, బిహార్, ఉత్తర ప్రదేశ్, ఉత్తరాఖండ్ లను ఆనుకుని ఉంటుంది.ప్రపంచంలోని అత్యంత పేద దేశాలలో ఒకటైన నేపాల్ ఆర్థిక వ్యవస్థ, ఇతర దేశాల నుంచి అందే ఆర్థిక సాయం, పర్యటక రంగాలపై ప్రధానంగా ఆధారపడి ఉంటుంది.అయితే, ఇప్పుడు మనం దాని భౌగోళిక, ఆర్థిక వ్యవస్థ గురించి కాకుండా, దాని చరిత్ర గురించి తెలుసుకుందాం.క్రీస్తు పూర్వం వెయ్యి సంవత్సరాల కిందట, నేపాల్ చిన్న చిన్న రాజ్యాలుగా, వంశాల సమాఖ్యలుగా విభజితమై ఉండేది. మధ్యయుగాల నుంచీ వస్తున్న శతాబ్దాల వైరాన్ని అంతం చేసిన ఘనత గూర్ఖా కింగ్ పృథ్వీ నారాయణ్ షాకు దక్కుతుంది.కింగ్ పృథ్వీ నారాయణ్ షా 1765లో నేపాల్ ఐక్యత కోసం ఉద్యమాన్ని ప్రారంభించి 1768 నాటికి అందులో విజయం సాధించారు. ఆధునిక నేపాల్ అప్పుడే ఆవిర్భవించింది.ఆ తర్వాత షా రాజవంశానికి చెందిన ఐదో రాజు రాజేంద్ర బిక్రమ్ షా పాలనలో, బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ, నేపాల్ సరిహద్దుల్లోని కొన్ని ప్రాంతాలను ఆక్రమించింది. దానితో 1815లో యుద్ధం మొదలైంది. ఇది సుగౌలి అగ్రిమెంట్ తో ముగిసింది.నేపాల్ రాజకుటుంబంలో వర్గ విభేదాలు పెరగడంతో అస్థిరత ఏర్పడింది. 1846లో కింగ్ సురేంద్ర బిక్రమ్ షా పాలనలో జంగ్ బహదూర్ రాణా శక్తివంతమైన సైనిక కమాండర్ గా అవతరించారు.ఆయన ప్రభావాన్ని తగ్గించడానికి అప్పటి రాణి ప్రయత్నించారు. దీంతో భీకర యుద్ధం జరిగింది. వందలమంది రాణి మద్దతుదారులు హత్యకు గురయ్యారు. దీని తర్వాత జంగ్ బహదూర్ రాణా మరింత శక్తివంతుడయ్యారు.ఈ ఘటనల తర్వాత రాజకుటుంబం ఆయన శక్తి ముందు తలొగ్గింది. ఆ తర్వాత ప్రధానమంత్రి పదవి వంశపారంపర్యంగా మారింది.రాణా కుటుంబం బ్రిటిష్ వారికి మద్దతిచ్చేది. 1857 నాటి భారత విప్లవంలో తిరుగుబాటుదారులకు, వ్యతిరేకంగా బ్రిటిష్ వారికి అనుకూలంగా వ్యవహరించింది రాణా కుటుంబం.ఈ సహకారం వల్ల 1923లో బ్రిటన్-నేపాల్ ల మధ్య ఒక ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం నేపాల్ కు స్వాతంత్ర్యాన్ని ఇచ్చింది బ్రిటన్.1940లలో నేపాల్ లో ప్రజాస్వామ్య అనుకూల ఉద్యమం ప్రారంభమైంది. రాజకీయ పార్టీలు రాణా కుటుంబ నియంతృత్వాన్ని విమర్శించడం ప్రారంభించాయి.ఇంతలోనే చైనా టిబెట్ ను ఆక్రమించింది. అదే క్రమంలో నేపాల్ ను కూడా ఆక్రమిస్తుందని భారత్ ఆందోళన చెందింది. భారతదేశం సహాయంతో అప్పటి రాజు త్రిభువన్ బీర్ బిక్రమ్ షా కొత్త పాలకుడిగా అవతరించారు. నేపాలీ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడింది.కానీ రాజు, ప్రభుత్వం మధ్య అధికారం కోసం పోరాటం కొనసాగింది. 1959లో ప్రజాస్వామ్యాన్ని రద్దు చేసి పంచాయతీ వ్యవస్థను అమలు చేశారు రాజు మహేంద్ర బీర్ బిక్రమ్ షా.1972లో రాజు బీరేంద్ర బిక్రమ్ షా రాజ్యం పగ్గాలు చేపట్టారు. దాదాపు 17 సంవత్సరాల తరువాత, 1989లో మరోసారి ప్రజాస్వామ్యం కావాలంటూ ఒక ఉద్యమం ప్రారంభమైంది.రాజ్యాంగ సంస్కరణలను రాజు బీరేంద్ర బీర్ బిక్రమ్ షా అంగీకరించాల్సి వచ్చింది.మే 1991లో నేపాల్ లో మొదటిసారిగా బహుళ పార్టీ పార్లమెంట్ ఏర్పడింది. అయితే, 1996 నాటికి దేశంలో మావోయిస్టు ఉద్యమం కూడా మొదలైంది.జూన్ 1, 2001న, నేపాల్ రాజభవనంలో జరిగిన సామూహిక హత్యలో రాజు, రాణి, యువరాజులు, యువరాణులు హత్యకు గురయ్యారు. ఆ తర్వాత, రాజు సోదరుడు జ్ఞానేంద్ర బీర్ బిక్రమ్ షా తదుపరి రాజుగా పాలన చేపట్టారు.మావోయిస్టుల ఉద్యమాన్ని అణచివేయడానికి ఫిబ్రవరి 2005లో రాజు జ్ఞానేంద్ర అధికారాన్ని సొంతం చేసుకుని, ప్రజా ప్రభుత్వాన్ని రద్దు చేశారు.2006, 2007 సంవత్సరాలలో నేపాల్ లో అనేక సంఘటనలు జరిగాయి. నవంబర్ 2006లో, ప్రభుత్వం మావోయిస్టులతో శాంతి ఒప్పందంపై సంతకం చేసింది. ఇది సుదీర్ఘ హింసాత్మక సంఘర్షణకు ముగింపు పలికింది.జనవరి 2007లో తాత్కాలిక రాజ్యాంగ నిబంధనల ప్రకారం మావోయిస్టులు ఎన్నికల్లో గెలిచి పార్లమెంటులో ప్రవేశించారు. అదే సంవత్సరం ఏప్రిల్ లో తాత్కాలిక ప్రభుత్వంలో చేరిన మావోయిస్టులు, ప్రధాన రాజకీయ స్రవంతిలో భాగమయ్యారు.అదే సంవత్సరం వారు తాత్కాలిక ప్రభుత్వం నుండి వైదొలిగి, రాచరికాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నవంబర్ లో జరగాల్సిన ఎన్నికలు వాయిదా పడ్డాయి.డిసెంబర్ 2007లో, తిరిగి ప్రభుత్వంలో చేరిన మావోయిస్టులతో శాంతి ఒప్పందంలో భాగంగా, రాచరికాన్ని రద్దు చేయడాన్ని పార్లమెంటు ఆమోదించింది.మే 2008లో, నేపాల్ గణతంత్ర రాజ్యంగా మారింది. అదే సంవత్సరం జూలైలో రామ్ బరన్ యాదవ్, నేపాల్ మొదటి అధ్యక్షుడయ్యారు. ఆగస్టులో మావోయిస్టు నాయకుడు పుష్ప కమల్ దహల్ సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు.2008 తర్వాత కూడా కొన్ని సంవత్సరాల పాటు నేపాల్ లో రాజకీయ పరిణామాలు కొనసాగాయి. సెప్టెంబర్ 2015లో పార్లమెంటు చరిత్రాత్మక రాజ్యాంగాన్ని ఆమోదించి నేపాల్ ను లౌకిక దేశంగా ప్రకటించింది.అక్టోబర్ 2015లో, కేపీ శర్మ ఓలీ కొత్త రాజ్యాంగం ప్రకారం ఎన్నికైన మొదటి ప్రధానమంత్రి అయ్యారు.గణతంత్ర రాజ్యంగా మారిన తర్వాత, నేపాల్ రాజకీయాలు ప్రాథమికంగా మూడు పార్టీల మధ్య తిరుగుతున్నాయి. కానీ, దేశం రాజకీయంగా అస్థిరంగానే ఉంది.ఇక 2025 సెప్టెంబర్ లో, నేపాల్ ప్రభుత్వం 26 సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ లను నిషేధించింది. వీటిలో ఫేస్ బుక్, ఇన్ స్టాగ్రామ్, వాట్సాప్ వంటి ప్రముఖ సోషల్ మీడియా, మెసేజింగ్ ప్లాట్ ఫామ్ లు ఉన్నాయి.దేశంలోని చట్టాలను పాటించడానికి వీలుగా, స్థానిక కార్యాలయాలను తెరవడానికీ, కంప్లయన్స్ ఆఫీసర్లను నియమించడానికీ సోషల్ మీడియా కంపెనీలకు వారం రోజుల సమయం ఇచ్చామని ప్రభుత్వం చెబుతోంది.చైనా సోషల్ మీడియా కంపెనీ టిక్ టాక్ ఈ షరతులను సకాలంలో పాటించింది. దీంతో అది నిషేధం సమస్యను ఎదుర్కోలేదు.ప్రస్తుతం నేపాల్ లో టిక్ టాక్ ట్రెండ్ అవుతోంది. నిరసనను నడిపిస్తున్నవారు టిక్ టాక్ లో అనేక వీడియోలను షేర్ చేసి ఆందోళనలో పాల్గొనాల్సిందిగా యువతను కోరుతున్నారు.'నెపో బేబీ' ట్రెండ్ టిక్ టాక్ లో కూడా ప్రారంభమైంది. దీనిలో రాజకీయ నాయకుల పిల్లల విలాసవంతమైన జీవితానికి సంబంధించిన ఫోటోలు, వీడియోలు పోస్టు అవుతున్నాయి.రాజకీయ నాయకులు తమ పిల్లలకు ప్రయోజనాల కోసం పనిచేస్తున్నారు తప్ప దేశం కోసం పని చేయడం లేదన్న వాదనను ఇది తెరపైకి తెచ్చింది.ఈ వ్యవహారం ముదిరిపోవడంతో పెద్ద ఎత్తున హింస జరిగింది. చాలామంది మరణించారు. ప్రభుత్వ వ్యతిరేక నిరసనల తర్వాత నేపాల్ ప్రధాన మంత్రి కేపీ శర్మ ఓలీ రాజీనామా చేశారు.సోషల్ మీడియా వెబ్ సైట్ లపై నిషేధం తర్వాత యువత నిరసనకు పిలుపునిచ్చారు.



# మోహన్ భగవత్ కరుణార్ద్ర నేత

'వసుధైవ కుటుంబకం' సూత్రంతో ప్రేరణ పొంది, సామాజిక మార్పు–సామరస్యం, సోదరభావ స్ఫూర్తి బలోపేతం లక్ష్యంగా తన జీవితాన్ని అంకితం చేసిన ఒక మహనీయుడి జన్మదినమిది. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ ఎస్ ఎస్ )తో అనుబంధంగల లక్షలాది మంది ఆయనను సగౌరవంగా.. ప్రేమాభిమానాలతో పరమ 'పూజ్య సర్ సంఘ్ చాలక్' అని పిలుచుకుంటారు. అవును... నేను చెబుతున్నది మోహన్ భగవత్ గురించే! ఆర్ ఎస్ ఎస్ శతాబ్ది ఉత్సవాల నేపథ్యంలో ఆయన 75వ జన్మదిన వేడుక నిర్వహించుకోవడం యాదృచ్ఛికం. ఈ సందర్భంగా నా శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆ దైవం ఆయనకు దీర్ఘాయుష్షు ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాను.మోహన్ భగవత్ కుటుంబంతో నా అనుబంధం ఎంతో లోతైనది. ఆయన తండ్రి దివంగత మధుకర్ రావు భగవత్ తో సన్నిహితంగా పనిచేసే అదృష్టం నాకు దక్కింది. ఈ అనుభవాన్ని నా రచన 'జ్యోతిపుంజ్'లో విస్తృతంగా వివరించాను. న్యాయ వ్యవస్థతో తన అనుబంధంతో పాటు, దేశ ప్రగతి కోసం ఆయన తనను తాను అంకితం చేసుకున్నారు. గుజరాత్ రాష్ట్రవ్యాప్తంగా 'ఆర్ ఎస్ ఎస్ 'ను బలోపేతం చేయడంలో కీలకపాత్ర పోషించారు. దేశ పురోగమనంపై మధుకర్ రావు తపన ఎంతటిదంటే– తన కుమారుడు మోహన్ రావును భారత పునరుజ్జీవనం దిశగా కృషికి పురిగొల్పింది. మధుకర్ రావు ఒక పరుసవేది కాగా, మోహన్ రావు రూపంలో మరో 'మణి'ని తీర్చిదిద్దారు.మోహన్ 1970 దశకం మధ్య భాగంలో ఆర్ ఎస్ ఎస్ ప్రచారక్ అయ్యారు. 'ప్రచారక్' అంటే– ఏదో ఒక సిద్ధాంతం ఆధారంగా సంబంధిత ప్రబోధాలను ప్రచారం చేసే బాధ్యతగా కొందరు అపార్థం చేసుకోవచ్చు. కానీ, ఆర్ ఎస్ ఎస్ పనితీరు గురించి తెలిసిన వారికి 'ప్రచారక్' అనేది సంస్థలో కీలక పని సంప్రదాయమనే వాస్తవం చక్కగా తెలుసు. గడచిన వంద సంవత్సరాలుగా దేశభక్తి ప్రేరణగా వేలాది యువత 'భారతదేశమే ప్రధానం' లక్ష్యంగా దాన్ని సాకారం చేసే దిశగా తమ జీవితాలను అంకితం చేశారు. ఇందుకోసం వారు ఇల్లూవాకిలీ సహా కుటుంబ బంధాలన్నిటినీ వదులుకుని దేశమాత సేవలో తరించారు.ఆయన 'ఆర్ ఎస్ ఎస్ 'లో ప్రవేశించిన తొలినాళ్ల సమయాన్ని భారత చరిత్రలో అంధకార యుగంగా అభివర్ణించవచ్చు. ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత క్రూర ఎమర్జెన్సీ విధించిన సమయమది. ప్రజాస్వామ్య సూత్రాలను గౌరవిస్తూ, దేశం ప్రగతి పథంలో పయనించాలని ఆకాంక్షించే ప్రతి వ్యక్తీ దీన్ని ప్రతిఘటిస్తూ ఉద్యమంలో దూకడం అత్యంత సహజం. అదే తరహాలో మోహన్ సహా అసంఖ్యాక 'ఆర్ ఎస్ ఎస్ ' స్వయంసేవకులు కూడా ఇలాగే చేశారు. మహారాష్ట్రలోని గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల్లో... ముఖ్యంగా విదర్భలో ఆయన విస్తృతంగా పనిచేశారు. తద్వారా పేదలు, అణగారిన వర్గాల సమస్యలను ఆకళింపు చేసుకునే అవకాశం ఆయనకు లభించింది.అనంతర కాలంలో భగవత్ 'ఆర్ ఎస్ ఎస్ 'లో వివిధ బాధ్యతలు నిర్వర్తించారు. ఆయా విధుల నిర్వహణలో ఆయన అసమాన నైపుణ్యం ప్రదర్శించారు. ముఖ్యంగా 1990 దశకంలో 'అఖిల భారతీయ శారీరక్ ప్రముఖ్' అధిపతిగా మోహన్ పనిచేసిన కాలాన్ని చాలామంది స్వయంసేవకులు నేటికీ ఎంతో ప్రేమాభిమానాలతో స్మరించుకుంటుంటారు. ఆ సమయంలో ఆయన బిహార్ రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో సంఘ్ నిర్మాణం కోసం అవిరళ కృషి చేశారు. జనజీవనంలోని క్షేత్రస్థాయి సమస్యలపై ఆయన అవగాహనను ఈ అనుభవాలు మరింత పెంచాయి. అటుపైన 21వ శతాబ్దారంభంలో ఆయన 'అఖిల భారతీయ ప్రచార ప్రముఖ్'గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం 2000లో 'సర్ కార్యవాహ్ ' అయ్యారు. ఈ రెండు పదవుల్లోనూ తనదంటూ ప్రత్యేక పనిశైలిని ఆచరణలో పెట్టారు. అత్యంత సంక్లిష్ట పరిస్థితులను సులువుగా, కచ్చితత్వంతో నిభాయించారు. ఆ తర్వాత 2009లో 'సర్ సంఘ్ చాలక్'గా ఆర్ ఎస్ ఎస్ పగ్గాలు చేపట్టిన నాటినుంచీ అందరికీ ఉత్తేజమిచ్చే విధంగా పనిచేస్తున్నారు.ఈ పదవీ నిర్వహణ సంస్థాగత బాధ్యతను మించిన కర్తవ్యం. సంస్థ ఉద్దేశాలు, నిర్దేశాలపై స్పష్టత, భరతమాతపై అపార ప్రేమగల అసాధారణ వ్యక్తులు త్యాగం, అచంచల నిబద్ధతతో ఈ బాధ్యతలకు కొత్త నిర్వచనమిచ్చారు. మోహన్ భగవత్ ఈ గురుతర బాధ్యతను అనితర సాధ్యంగా నిర్వహించడంతోపాటు స్వీయ శక్తిసామర్థ్యాలు, మేధస్సు జోడించి కరుణార్ద్ర నాయకత్వాన్ని ఆచరణాత్మకంగా చూపారు. 'దేశమే ప్రధానం' అన్న సూత్రమే వీటన్నిటికీ ప్రేరణ!అవిచ్ఛిన్నత, అన్వయం.. మోహన్ జీ మనఃపూర్వకంగా భావించిన, తన కార్యశైలిలో ఇముడ్చుకున్న ముఖ్యమైన అంశాలపై ఆలోచిస్తే ఈ రెండూ నాకు స్ఫురిస్తాయి. మనం గర్వించే సంస్థాగత భావజాలపరంగా రాజీపడకుండా, అదే సమయంలో మారుతున్న సామాజిక అవసరాలకూ అనుగుణంగా.. సంక్లిష్టమైన అంశాల్లోనూ ఆయన సమర్థంగా సంస్థను ముందుకు నడిపారు. ఆయనకు యువతతో సహజమైన అనుబంధం ఉంది. ఎప్పుడూ పెద్ద సంఖ్యలో యువతను సంఘ్ పరివార్ లో భాగస్వాములను చేయడంపై దృష్టి సారించారు. ఆయనెప్పుడూ బహిరంగ చర్చల్లో పాల్గొంటూ, ప్రజలతో సంభాషిస్తూ కనిపిస్తారు. నేటి గతిశీల, డిజిటల్ ప్రపంచంలో ఇది అత్యంత ప్రయోజనకరమైన అంశం.స్థూలంగా చెప్పాలంటే, వందేళ్ల ఆర్ఎస్ఎస్ ప్రస్థానంలో భగవత్ జీ బాధ్యతలు నిర్వర్తించిన కాలం అత్యంత విప్లవాత్మక సమయమని చెప్పక తప్పదు. యూనిఫాంలో మార్పు నుంచి శిక్షా వర్గలలో (శిక్షణ శిబిరాలు) మార్పుల వరకు.. ఆయన నేతృత్వంలో అనేక ముఖ్యమైన మార్పులు వచ్చాయి.మానవత్వం విపత్తుతో తలపడిన కోవిడ్ కాలంలో మోహన్ జీ కృషి నాకు ఎప్పటికీ గుర్తుంటుంది. మన జీవితకాలంలో మునుపెన్నడూ చూడని ఆ విపత్తు వేళ ఆర్ఎస్ఎస్ సాంప్రదాయక కార్యకలాపాల కొనసాగింపు సవాలుగా మారింది. సాంకేతికత వినియోగాన్ని పెంచాలని మోహన్ జీ సూచించారు. ప్రపంచవ్యాప్త సవాళ్ల నేపథ్యంలో.. సంస్థాగత యంత్రాంగాలను అభివృద్ధి చేస్తూనే, అంతర్జాతీయ పరిణామాలనూ నిశితంగా పరిశీలించారు. స్వీయ రక్షణ చర్యలతోపాటు ప్రజా రక్షణను కర్తవ్యంగా భావిస్తూ.. ఆపన్నులను ఆదుకునేందుకు ఆ సమయంలో స్వయంసేవకులంతా శక్తివంచన లేకుండా కృషి చేశారు. అనేకచోట్ల వైద్య శిబిరాలు నిర్వహించాం. కష్టపడి పనిచేసే మా స్వయంసేవకులను కూడా మేం కోల్పోయాం. కానీ మోహన్ జీ స్ఫూర్తి వల్ల వారి దృఢ సంకల్పం ఎప్పుడూ సడలలేదు.ఈ ఏడాది మొదట్లో నాగ్ పూర్ లో మాధవ్ నేత్ర చికిత్సాలయ ప్రారంభోత్సవం సందర్భంగా.. ఆర్ ఎస్ ఎస్ ఒక అక్షయవటం (మర్రివృక్షం) లాంటిదని, అది మన దేశ సంస్కృతిని, సామూహిక చైతన్యాన్ని శక్తిమంతం చేస్తుందని నేను వ్యాఖ్యానించాను. ఈ అక్షయవట మూలాలు లోతైనవి, బలమైనవి. ఎందుకంటే అవి విలువలతో కూడుకున్నవి. ఈ విలువలను పెంపొందించడానికి, ముందుకు తీసుకెళ్లడానికి మోహన్ భగవత్ జీ అంకితభావంతో వ్యవహరించిన విధానం నిజంగా స్ఫూర్తిదాయకం.మోహన్ జీ వ్యక్తిత్వంలో మరో అద్భుత లక్షణం ఆయన మృదుభాషణం. ఆయన అందరి మాటా వింటారు. ఈ లక్షణం విస్తృత దృక్పథానికి నిదర్శనం. ఇదే ఆయన వ్యక్తిత్వానికి, నాయకత్వానికి శోభనిచ్చింది.వివిధ ప్రజా కార్యక్రమాలపై ఆయన చూపించిన ఆసక్తి గురించి కూడా నేను రాయాలనుకుంటున్నాను. స్వచ్ఛ భారత్ మిషన్ నుంచి బేటీ బచావో బేటీ పడావో వరకు.. ఈ కార్యక్రమాల్లో ఉత్సాహంగా భాగస్వామ్యం వహించాలని మొత్తం ఆర్ ఎస్ ఎస్ కుటుంబానికీ ఆయన ఎప్పుడూ చెప్పేవారు. సామాజిక శ్రేయస్సు కోసం మోహన్ జీ 'పంచ పరివర్తన్' అందించారు. సామాజిక సామరస్యం, కుటుంబ విలువలు, పర్యావరణ అవగాహన, జాతీయ భావన, పౌర విధులు ఇందులోని అంశాలు. జీవితంలోని ప్రతి దశలో ఇవి భారతీయులకు స్ఫూర్తినిస్తాయి. బలమైన, సంపన్నమైన దేశాన్ని చూడాలని ప్రతి స్వయంసేవక్ కలలుగంటాడు. దాన్ని సాకారం చేయడం కోసం.. స్పష్టమైన దార్శనికత, నిర్ణయాత్మక కార్యాచరణ రెండూ కావాలి. మోహన్ జీలో ఈ రెండు లక్షణాలను పుష్కలంగా ఉన్నాయి. భగవత్ జీ ఎప్పుడూ 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' గురించి బలంగా చెప్తారు. భారతదేశ వైవిధ్యాన్ని గట్టిగా నమ్మే వ్యక్తి. దేశంలో భాగమైన అనేక విభిన్న సంస్కృతులు, సంప్రదాయాలను ఘనంగా చాటుతారు.తన షెడ్యూల్ ఎంత బిజీగా ఉన్నా.. మోహన్ జీ సంగీతం, పాటల వంటి అభిరుచులకు ఎప్పుడూ సమయం కేటాయించారు. వివిధ భారతీయ సంగీత వాయిద్యాలలో ఆయన చాలా ప్రజ్ఞాశాలి అని కొద్ది మందికే తెలుసు. చదవడం పట్ల ఆయనకున్న మక్కువ ఆయన ప్రసంగాలు, సంభాషణలలో కనిపిస్తుంది.మరి కొన్ని రోజుల్లో ఆర్ఎస్ఎస్ 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటుంది. ఈ సంవత్సరం విజయదశమి, గాంధీ జయంతి, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి, ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు ఒకే రోజున జరగడం కూడా ఒక ఆనందకరమైన యాదృచ్ఛికం. భారతదేశంతోపాటు ప్రపంచవ్యాప్తంగా ఆర్ఎస్ఎస్ తో అనుబంధం ఉన్న లక్షలాది మందికి ఇది ఒక చరిత్రాత్మక ఘట్టం అవుతుంది. ఈ సమయంలో మోహన్ జీ వంటి తెలివైన, కష్టపడి పనిచేసే సర్ సంఘచాలక్ సంస్థను నడిపిస్తున్నారు. మనం అంతరాలకూ హద్దులకూ అతీతంగా ఎదిగి, ప్రతి ఒక్కరినీ మనవారిగా భావిస్తే సమాజంలో నమ్మకం, సోదరభావం, సమానత్వం బలపడుతుందని చాటిన మోహన్ జీ వసుధైక కుటుంబానికి సజీవ ఉదాహరణగా చెబుతూ నేను ముగిస్తున్నాను. దీర్ఘాయుష్షుతో, ఆరోగ్యంతో మోహన్ జీ భరతమాత సేవలో ముందుకు సాగాలని కోరుకుంటున్నాను.

# స్థానిక సంస్థల ఎన్నికల ఆలస్యం

స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 42%కు పెంచడం విషయంలో బీసీ నాయకులు, బీసీ ప్రజలు ఎప్పుడు తమ కోసం తెచ్చిన బీసీ రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం కలుగుతుందో నని ఎదురు చూస్తూ ఉన్నారు. తెలంగాణ ప్రభుత్వం అందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినా కూడా కేంద్ర ప్రభుత్వం అందుకు మోకాలడ్డుతూ ఉంది. తెలంగాణ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ బిల్లుపై కీలక నిర్ణయాలు, ఆదేశాలు తీసుకున్న విషయం తెలిసిందే.స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లను 42 శాతానికి పెంచే ప్రతిపాదన అసెంబ్లీలో ఆమోదం పొందినా, గవర్నర్ వద్ద బిల్లులు పెండింగ్ లో ఉంది. ఎప్పుడు ఆమోదం దక్కుతుందా? అని బీసీ జనం ఎదురుచూస్తున్నారు. అంతేకాకుండా బీసీ రిజర్వేషన్ బిల్లు ఆగి పోవడం వెనుక బీజేపీ కుట్ర ఏమైనా దాగి ఉందా? అనే అనుమానాలు కూడా ఉన్నాయి. బీసీలకు న్యాయం చేయడం బీజేపీకి ఇష్టం లేదా? అనే ప్రశ్న ప్రజల్లో తలెత్తుతోంది.కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చుకో వడానికి తన వంతుగా కృషి చేస్తూనే ఉంది. రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు, రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే కామారెడ్డి డిక్లరేషన్ పేరిట రెండు కీలక హామీలను అమలు చేయాలని నిర్ణయించింది. అందులో భాగంగా కీలక అడుగులు కూడా పడ్డాయి. విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల పెంపు, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల పెంపు విషయంలో తెలంగాణ ప్రభుత్వం తమ చిత్తశుద్ధిని చాటుకుంది. ఇక రాష్ట్రవ్యాప్తంగా కుల గణన పూర్తి చేసి, ప్రత్యేక డెడికేషన్ కమిషన్ ను ఏర్పాటు చేసింది. ఆ నివేదిక ఆధారంగా అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం చేసి బిల్లును గవర్నర్ ద్వారా రాష్ట్రపతికి పంపింది. ఈ బిల్లుకు ఎప్పుడు క్లియరెన్స్ వస్తుందా? అని ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.ఒక వైపు స్థానిక ఎన్నికల షెడ్యూల్ సమీపిస్తోంది. కోర్టు ఇచ్చిన గడువులో చర్యలు పూర్తి




చేయకపోతే పాత రిజ ర్వేషన్ విధానంతోనే ఎన్నికలు జరగాల్సి రావచ్చు. లేదా ఎన్నికలు వాయిదా పడే ప్రమాదం ఉంది. బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా ప్రత్యేక తీర్మానం చేసి జీవో జారీ చేసే ఆలోచన ఉన్నా, రాజ్యాంగ నిపుణులు పలు అంశాలను హెచ్చరిస్తున్నారు. ఎందుకంటే గతంలో పలు సందర్భాల్లో మోసపోయిన బీసీలు మరోసారి మోసపోయే అవకాశం ఉందని భావిస్తూ ఉన్నారు. అయితే ఈ విషయంలో బీసీల పోరాటం అసలు ఆగదని, కేంద్రంపై ఒత్తిడి తీసుకుని వచ్చేందుకు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ప్రభుత్వ ఆధ్వర్యంలో భారీ ధర్నా జరిగింది. సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నేతలతో పాటు బీసీ సంఘాలు ఈ నిరసన ప్రదర్శనలో పాల్గొన్నాయి. కేవలం రాజకీయ కోణంలోనే కాకుండా, బీసీల హక్కుల సాధనలో కూడా ఈ పరిణామాలు భాగం. 42% బీసీ రిజర్వేషన్లు అమలు అయ్యే వరకు గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఉద్యమం ఆగదని హెచ్చరికలు కేంద్రానికి పంపారు. బీసీ బిల్లును ముస్లింల బిల్లుగా ముద్ర వేయడంపై కూడా పలువురు విమర్శించారు.బీసీలకు 42% రిజర్వేషన్ కల్పించేందుకు వీలుగా రిజర్వేషన్లపై 50% పరిమితిని ఎత్తివేస్తూ పంచాయతీరాజ్, మున్సిపల్ చట్టాల సవరణ ఆర్డినెన్సులను ప్రభుత్వం తీసుకు వచ్చింది. ఈ రెండు ఆర్డినెన్సులు జూలై 15న గవర్నర్ కార్యాలయానికి చేరాయి. గవర్నర్ వాటిని కేంద్ర హోంశాఖకు పంపారు. రాష్ట్రపతి వద్ద బిల్లులు, గవర్నర్ వద్ద ఆర్డినెన్సులు పెండింగ్ లో ఉండటంతో సమస్య మరింత పెరిగింది. హైకోర్టు సెప్టెంబర్ 30 గడువు దగ్గర పడుతుండటంతో ప్రభుత్వం వర్షాకాల సమావేశాల్లో రెండు సవరణ బిల్లులను ఆమోదించి గవర్నర్ కు పంపింది. కానీ, గవర్నర్ వాటిని కూడా న్యాయ సలహా కోసం నిలిపివేశారు.న్యాయపరంగా రాష్ట్రపతి/గవర్నర్ల వద్దకు రాష్ట్రాలు పంపిన బిల్లులను మూడు నెలల్లోగా ఆమోదించాలని సుప్రీంకోర్టు రూలింగ్ ఇచ్చింది. దీనిపై రాష్ట్రాల అభి ప్రాయాలు ప్రస్తుతం సుప్రీంకోర్టు ముందు వినిపిస్తున్నాయి. తెలంగాణలో బీసీ రిజర్వేషన్ పెంపు కేవలం ఎన్నికల హామీ కాదు. ఇది చట్టపరమైన, రాజకీయ, సామాజిక న్యాయం కోసం జరుగుతున్న పోరాటం. దీర్ఘ కాలిక ఫలితాల కోసం రాజ్యాంగబద్ధ చట్ట సవరణ చేసిన బిల్లులు, గవర్నర్ ఆమోదం, జీవో విడుదల తప్పనిసరి అవసరంగా మారింది. బీసీ రిజర్వేషన్లపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మొదటి నుంచే వ్యతిరేకంగా ఉండడం వల్ల బీసీలకు అన్యాయం జరుగుతోంది.దశాబ్దాలుగా బీసీలు అణచివేతకు గురవుతున్నారు. బీసీల విషయంలో బీజేపీ నిబద్ధత ఎక్కడ? రాష్ట్రపతి వద్ద పెండింగ్ లో ఉన్న బిల్లులు నెలల తరబడి ఆగిపోవడం ఎందుకు? బండి సంజయ్, లక్ష్మణ్, ఈటల రాజేందర్, అరవింద్ లు సమాధానం చెప్పాలి. జంతువుల లెక్కలు ఉన్న దేశంలో, బీసీల లెక్కలు ఎందుకు లేవనే ప్రశ్నను వేసుకోవాలి బీసీ నేతలు.. నెలల తరబడి ఫైళ్లను పెండింగ్ లో ఉంచడం, పంచాయతీరాజ్ చట్ట సవరణ ఆర్డినెన్స్ కూడా అదే గతి పడటం చాలా బాధాకరం. బీసీల పట్ల బీజేపీ నిర్లక్ష్య వైఖరికి నిలువెత్తు నిదర్శనంగా మారింది. ఇకనైనా ఈ పద్ధతి మార్చుకోవాలని బీసీ నేతలు, ప్రజలు బీజేపీకి హితవు పలుకుతూ ఉన్నారు.

సంపాదకీయం పేజీలో రచనలు పంపవలసిన వాట్సప్ నంబర్ ,మెయిల్ ఐడి 9951512539 flashindia999@gmail.com

### సాదాబైనామాల క్రమబద్ధీకరణకు

# రంగం సిద్ధం

- 2020లో దాఖలైన సాదాబైనామా దరఖాస్తుల ప్రాసెసింగ్ ప్రారంభం
- సుమారు 9 లక్షల మంది రైతులు దరఖాస్తు చేసిన భూములపై స్పష్టత
- 11 లక్షల ఎకరాల భూములకు 13-బి ప్రొసీడింగ్స్ జారీకి అవకాశం
- రైతులకు చట్టబద్ధ రక్షణ కలిగించే ప్రభుత్వ నిర్ణయం

**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సాదాబైనామాల క్రమబద్ధీకరణపై రెవెన్యూశాఖ తాజా నోటిఫికేషన్ ను విడుదల చేసింది. తెలంగాణ భూ భారతి చట్టం, 2025లోని సెక్షన్ 6, సబ్-సెక్షన్ (1) ప్రకారం నమోదుకాని లావాదేవీల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తులను ప్రాసెస్ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. 2020 అక్టోబర్ 12 నుంచి నవంబర్ 10 వరకు నమోదుకాని లావాదేవీల (సాదాబైనామాలు) కింద రైతులు దాఖలు చేసిన దరఖాస్తులను ఇప్పుడు ప్రాసెస్ చేయనున్నట్లు నోటిఫికేషన్ లో పేర్కొంది.దీని ద్వారా అప్పట్లో పెండింగ్ లో ఉన్న వేలాది కేసులకు పరిష్కారం లభించే అవకాశం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా సాదాబైనామా క్రమబద్ధీకరణ కోసం సుమారు 9,00,894 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. వీరికి సంబంధించిన భూములపై అధికారిక ధ్రువీకరణ లభించే అవకాశం ఉందని అంచనా. ఈ నోటిఫికేషన్ ద్వారా సుమారు 11 లక్షల ఎకరాల భూములకు 13-బి ప్రొసీడింగ్స్ జారీ అయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. దీని వలన రైతుల భూములకు చట్టపరమైన రక్షణ లభించనుంది.

## సీబీఐ అదుపులో మోస్ట్ వాంటెడ్ ఆర్థిక నేరస్థుడు

**ఢిల్లీ :** మోస్ట్ వాంటెడ్ ఆర్థిక నేరగాన్ని సీబీఐ అదుపులోకి తీసుకున్నట్లు ప్రకటించింది. వంచన, తప్పుడు పత్రాల కేసులో వాంటెట్ నేరస్తుడిగా మారిన మునవర్ ఖాన్ ను సీబీఐ కువైట్ నుంచి భారత్ కు విజయవంతంగా తీసుకొచ్చింది. ఇంటర్ పోల్ ఛానెల్స్ ద్వారా జరిగిన ఈ చర్యలో సీబీఐలోని ఇంటర్నేషనల్ పోలీస్ కోఆపరేషన్ యూనిట్ , భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ , అలాగే NCB-కువైట్ కలిసి పనిచేశాయి. సీబీఐ ఇప్పటికే మునవర్ ఖాన్ పై రెడ్ నోటీస్ జారీ చేయగా, అతడి కోసం పలు నెలలుగా ప్రయత్నాలు చేసింది.చివరికి సెప్టెంబర్ 11న ఈ రోజు కువైట్ పోలీసుల బృందం అతడిని ఎస్కార్ట్ చేస్తూ హైదరాబాద్ లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం కి తీసుకువచ్చింది. అక్కడ సీబీఐ స్పెషల్ టాస్క్ బ్రాంచ్ , చెన్నై బృందం అతడిని కస్టడీలోకి తీసుకుంది. మునవర్ ఖాన్ పై నకిలీ పత్రాల సృష్టి, మోసం ఆరోపణలు ఉండగా, ఈ కేసులో అతని అరెస్ట్ తో సీబీఐ దర్యాప్తుకు మరింత వేగం అందనుంది. అంతర్జాతీయ స్థాయిలో సహకారంతో నేరస్థులను భారత్ కు తీసుకువచ్చే విషయంలో ఈ చర్య సీబీఐ ధృఢ సంకల్పానికి మరో నిదర్శనంగా నిలిచింది.

## లైబ్రరీ వద్ద మొదలైన ఆందోళన..



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** గ్రూప్-1 జనరల్ ర్యాంకింగ్ లిస్ట్ ను రద్దు చేయాలని తెలంగాణ హైకోర్టు ఇటీవల కీలక తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే గ్రూప్-1 అవకతవకలపై గురువారం అశోక్ నగర్ (చిక్కడపల్లి) సెంట్రల్ లైబ్రరీ వద్ద బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో నిరుద్యోగులతో కలిసి ప్రభుత్వానికి, పబ్లిక్ కమిషన్ కి వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు వారిని చెదరగొట్టారు. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ సహా కార్యకర్తలను ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా గెల్లు శ్రీనివాస్ మాట్లాడుతూ.. గ్రూప్-1 పరీక్షలను తిరిగి నిర్వహించడంతో పాటు ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రూప్-1 పరీక్ష నిర్వాహణలో టీజీపీఎస్ సీ విఫలమైంది కాబట్టి.. నైతిక బాధ్యత వహిస్తూ కమిషన్ చైర్మన్, అధికారులు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.హైకోర్టు తీర్పు మేరకు గ్రూప్-1 పరీక్ష రద్దు చేసి మళ్లీ పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు. టీజీపీఎస్సీ వైఫల్యం కారణంగా గ్రూప్-1 అభ్యర్థులు తీవ్ర అన్యాయానికి గురయ్యారని, పరీక్ష నిర్వహణలో అనేక అక్రమాలు చోటుచేసుకున్నందున హైకోర్టు సిట్టింగ్ జడ్జి ఆధ్వర్యంలో విచారణ జరపాలని, తెలుగు మీడియం విద్యార్థులకు పేపర్ వాల్యుయేషన్లో తీవ్ర అన్యాయం జరిగిందని, అందువల్ల ప్రస్తుత నోటిఫికేషన్ ను రద్దు చేయాలని కోరారు. అలాగే, తప్పు చేసిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టంగా డిమాండ్ చేశారు.

# బీఆర్ఎస్..నెంబర్ 1

**న్యూఢిల్లీ :** 2023–24 ఆర్థిక సంవత్సరంలో దేశంలోనే అత్యధిక ఆదాయాన్ని ఆర్జించిన ప్రాంతీయ పార్టీల్లో బీఆర్ఎస్ ఫస్ట్ ప్లేస్ లో నిలిచింది. ఈ పార్టీకి ఆ ఏడాది మొత్తం రూ.685.51 కోట్ల ఆదాయం లభించింది. అదే ఏడాదికి సంబంధించి దేశవ్యాప్తంగా 40 ప్రాంతీయ పార్టీలు కలిపి రూ.2,532.09 కోట్ల ఆదాయాన్ని ప్రకటించగా, అందులో బీఆర్ఎస్ పార్టీనే రూ.685 కోట్ల (27%) ఆదాయం ప్రకటించినట్లు అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) బుధవారం తన రిపోర్టులో వెల్లడించింది. ప్రాంతీయ పార్టీలు ఇచ్చిన ఆడిట్ నివేదికల ఆధారంగా ఈ రిపోర్టును ఏడీఆర్ తయారు చేసింది. దేశవ్యాప్తంగా 40 ప్రాంతీయ పార్టీలకు వచ్చిన ఆదాయంలో రూ.2,117.85 కోట్లు (83.64 శాతం) స్వచ్ఛంద విరాళాల ద్వారా వచ్చినట్లు రిపోర్టులో పేర్కొంది. ఇందులో రూ.1,796.024 కోట్లు (70 శాతానికి పైగా) ఎన్నికల బాండ్ల రూపంలో సమకూరినట్లు తెలిపింది. ఆదాయం పరంగా బీఆర్ఎస్ తర్వాత టీఎంసీ (646.39 కోట్లు), బీజేడీ (297.81 కోట్లు) , టీడీపీ (285.07 కోట్లు), వైసీపీ (191.04 కోట్లు) ఉన్నట్లు వెల్లడించింది. ఈ ఐదు పార్టీల ఆదాయమే రూ.2,105.82 కోట్లు అని, మొత్తం ప్రాంతీయ పార్టీల ఆదాయంలో వీటిదే 83.17 శాతం వాటా అని వివరించింది. కాగా, 2022–23 ఆర్థిక సంవత్సరంతో ఈ 40 ప్రాంతీయ పార్టీల ఆదాయం రూ.1,736.851 కోట్లుగా ఉందని, 2023–24లో ఇన్ కమ్ రూ.794.951 కోట్లు పెరిగిందని పేర్కొంది. అత్యధికంగా టీఎంసీ ఆదాయం రూ.312.93 కోట్లు, టీడీపీది రూ.221.07 కోట్లు, బీజేడీ ఆదాయం రూ.116.753 కోట్లు పెరిగినట్టు చెప్పింది. 2022–23, 2023–24 ఆర్థిక సంవత్సరాల్లో గోవా ఫార్వార్డ్ పార్టీ మాత్రం జీరో ఆదాయాన్ని చూపినట్టు ఏడీఆర్ తన రిపోర్టులో వెల్లడించింది.


**బీఆర్ఎస్ ఖర్చు 254 కోట్లు..**

40 ప్రాంతీయ పార్టీల ఖర్చులు రూ.1,320 .96 కోట్లుగా ఉన్నాయని ఏడీఆర్ తన రిపోర్టులో వెల్లడించింది. ఇందులో బీఆర్ఎస్ రూ.254.914 కోట్లు ఖర్చు చేసినట్టు తెలిపింది. వైసీపీ, డీఎంకే, ఎస్పీ, జేడీయూ సహా 12 పార్టీలు ఆదాయానికి మించి ఖర్చు చేసినట్టు చెప్పింది. జీరో ఆదాయం ఉన్న గోవా ఫార్వర్డ్ పార్టీ రూ.1.56 లక్షల ఖర్చు చూపిందని పేర్కొంది.

### కలకలం రేపుతున్న

## ఉగ్ర కదలికలు

- నిజామాబాద్ జిల్లాలో కలకలం రేపుతున్న ఉగ్ర కదలికలు
- బోధన్ యువకుడు ఉజైఫా యామన్ అరెస్ట్
- ఉజైఫాను అరెస్ట్ చేసిన ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు
- ఢిల్లీ తీసుకెళ్లి ప్రశ్నిస్తున్న పోలీసులు రాంచీలో ఉగ్రవాది డ్యానిష్ ఇచ్చిన
- సమాచారంతో ఉజైఫా అరెస్ట్
- ఉజైఫా యామన్ దగ్గర ఎయిర్ పిస్టల్, బుల్లెట్లు స్వాధీనం



**నిజామాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఉగ్రవాద సంబంధాలున్నాయనే ఆరోపణలతో బోధన్ కు చెందిన యువకుడు ఉజైఫా యామన్ను ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం అతన్ని ఢిల్లీకి తరలించారు. ఈ అరెస్టుతో బోధన్ పట్టణం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. పోలీసులు వెల్లడించిన సమాచారం ప్రకారం, జార్ఖండ్ రాష్ట్రం రాంచీలో బాంబు దాడులకు కుట్రలు చేస్తున్న డ్యానిష్ అనే ఉగ్రవాది ఇచ్చిన సమాచారం ఆధారంగా యామన్ ను అరెస్ట్ చేశారు. ఉగ్రవాదులకు సంబంధించిన యాప్ లో యామన్ ఆయుధాలు, మందుగుండు సామాగ్రి తయారీలో పాలుపంచుకున్నట్లు పోలీసులు గుర్తించారు.యామన్ నివాసంలో జరిపిన సోదాల్లో పోలీసులు ఒక ఎయిర్ పిస్టల్ మరియు కొన్ని బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనతో బోధన్ లో ఉగ్రవాద మూలాల కదలికలు ఉన్నాయనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం యామన్ ఢిల్లీ పోలీసుల కస్టడీలో ఉన్నాడు, కేసులో పూర్తి స్థాయి విచారణ కొనసాగుతోంది. ఈ అరెస్ట్ స్థానికులను తీవ్ర భయాందోళనలకు గురిచేసింది. ఉగ్రవాద సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలతో ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేసిన ఉజైఫా యామన్ కు ఉగ్రవాదులతో ఎలాంటి సంబంధాలు లేవని అతని కుటుంబ సభ్యులు గట్టిగా ఖండించారు. కేవలం అనుమానం ఆధారంగానే తమ కుమారుడిని అరెస్ట్ చేశారని, దర్యాప్తులో ఎలాంటి ఆధారాలు లభించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.యామన్ కుటుంబ సభ్యులు వెల్లడించిన వివరాల ప్రకారం, యామన్ కేవలం ఆన్ లైన్ లో డానిష్ అనే వ్యక్తితో వీడియో కాల్ మాట్లాడాడు. ఈ కాల్ ఆధారంగానే ఢిల్లీ పోలీసులు యామన్ కు ఉగ్రవాద సంబంధాలు ఉన్నాయని అనుమానించి అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తమ ఇంటికి వచ్చినప్పుడు దర్యాప్తుకు పూర్తిగా సహకరించామని, కానీ వారి సోదాల్లో ఎలాంటి ఉగ్రవాద సంబంధిత ఆధారాలు లభించలేదని కుటుంబం స్పష్టం చేసింది.యామన్ ఒక అమాయకుడని, అతనికి ఉగ్రవాద కార్యకలాపాలతో ఎలాంటి సంబంధం లేదని అతని కుటుంబ సభ్యులు పదే పదే నొక్కి చెప్పారు. తమ కుమారుడిని వెంటనే విడిచిపెట్టాల్సిందిగా వారు ఢిల్లీ పోలీసులను వేడుకుంటున్నారు. ఈ ఘటన బోధన్ లో చర్చనీయాంశంగా మారింది, స్థానికులు కూడా యామన్ అమాయకత్వాన్ని నమ్ముతున్నారు. ఈ కేసులో ఇంకా దర్యాప్తు కొనసాగుతోంది. కుటుంబ సభ్యుల వాదనను పోలీసులు పరిగణనలోకి తీసుకుంటారా లేదా అనేది వేచి చూడాలి. ప్రస్తుతం ఈ కేసులో తదుపరి పరిణామాల కోసం యామన్ కుటుంబంతో పాటు స్థానికులు ఎదురు చూస్తున్నారు.

## భారతీయులు రష్యా ఆర్మీలో చేరొద్దు..

**ఢిల్లీ :** రష్యా ఉక్రెయిన్ యుద్ధం కొన్ని నెలలుగా జరుగుతున్న సంగతి మీకు తెలిసిందే. అయితే ఉద్యోగాల కోసం రష్యాకు వెళ్లిన భారతీయుల్లో కొందరు రష్యన్ సైన్యంలో చేరారని వార్తలు రావడంతో, ఈ విషయంపై విదేశాంగ మంత్రిత్వ శాఖను ప్రశ్నించిగా, భారత పౌరులకు ఒక హెచ్చరిక జారీ చేసింది. భారత పౌరులు రష్యన్ సైన్యంలో చేరకూడదని, అదొక ప్రమాదకరమైన కోర్సు అని హెచ్చరించింది. నిజానికి, ప్రతి సంవత్సరం లక్షల మంది భారతదేశం నుండి ఉద్యోగాల కోసం విదేశాలకు వెళ్తుంటారు. అందులో రష్యా కూడా ఒక దేశం. వీరిలో కొంతమందికి రష్యన్ సైన్యంలో చేరడానికి ఆఫర్లు వస్తున్నాయి. ఇంకా, మంచి జీతం కూడా వస్తుందని నమ్మిస్తున్నారు. ఉక్రెయిన్ తో జరుగుతున్న యుద్ధం కారణంగా రష్యాకు ఇప్పుడు ఎక్కువమంది సైనికులు అవసరం, ఎందుకంటే రష్యా దేశంలోని యువత సైన్యంలో చేరడానికి ఇష్టపడటం లేదు. దింతో ఉద్యోగాల కోసం రష్యా వెళ్లే భారతీయులకి మాయమాటలు చెప్పి రష్యన్ సైన్యంలో చేర్చుకుంటున్నారు.విదేశాంగ మంత్రిత్వ శాఖ ఏం చెప్పిందంటే : రష్యన్ సైన్యంలో భారతీయుల నియామకం గురించి విదేశాంగ మంత్రిత్వ శాఖను ప్రశ్నించారు. దీనికి సమాధానంగా మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మాట్లాడుతూ భారతీయులు రష్యన్ సైన్యంలో చేరకూడదని, ఈ మధ్య రష్యన్ సైన్యంలో భారతీయ పౌరుల నియామకం గురించి వార్తలు చూశాను అని అన్నారు. చాల సందర్భాల్లో ప్రభుత్వం ఇలాంటి వాటిలో ఉన్న ప్రమాదాలను హైలైట్ చేసి, భారత పౌరులను హెచ్చరించిందన్నారు.ఢిల్లీ, మాస్కోలోని రష్యన్ అధికారులతో కూడా మేము ఈ విషయాన్ని చర్చించాము. ఈ పద్ధతిని ఆపేసి మా పౌరులను విడుదల చేయాలని కోరాము. రష్య సైన్యంలో చేరిన భారతీయ పౌరుల కుటుంబాలతో కూడా మేము సంప్రదిస్తున్నాము అని MEA ప్రతినిధి అన్నారు. విదేశాలలో జాబ్ ఆఫర్లను ఒప్పుకోవద్దని కూడా భారతీయులను హెచ్చరించాము, రష్యన్ సైన్యంలో చేరడానికి వచ్చే ఏ ఆఫర్ కైనా దూరంగా ఉండాలని కోరుతున్నామన్నారు.

## తీర్పును రిజర్వ్ చేసిన సుప్రీం కోర్టు



**ఢిల్లీ :** దేశ వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారిన గవర్నర్లు, రాష్ట్రపతి బిల్లుల ఆమోదానికి నిర్ణీత సమయం లో ఆమోదం తెలపాలనే అంశంపై సుప్రీం కోర్టు సుదీర్ఘంగా విచారించింది. ఈ పిటిషన్లపై ఇరువైపుల వాదనలు విన్న సుప్రీంకోర్టు తన తీర్పును రిజర్వ్ చేసింది. బిల్లులకు ఆమోదం ఇవ్వడంలో సమయ పరిమితులు విధించవచ్చా అన్న అంశంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వేసిన ప్రెసిడెన్షియల్ రిఫరెన్స్ పై విచారణ పూర్తి చేసిన కోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. గతంలో తమిళనాడు కేసులో సుప్రీం కోర్టు గవర్నర్లు నిరవధికంగా బిల్లులను పెండింగ్ లో ఉంచే అధికారం లేదని, నిర్దిష్ట సమయానికి చర్య తీసుకోవాలని స్పష్టం చేసిన విషయం తెలిసిందే.అయితే ఇప్పుడు ఆ తీర్పు ప్రకారం కోర్టు నిజంగా అలాంటి టైమ్ లైన్ లు విధించే అధికారం కలిగిఉందా? గవర్నర్, రాష్ట్రపతి నిర్ణయాలు న్యాయ సమీక్షకు లోబడి ఉంటాయా? అనే అంశాలపై విస్తృత చర్చ జరిగింది. కేంద్రం తరఫున కోర్టు ఇలాంటి సమయ పరిమితులు విధించడం రాజ్యాంగ సమతుల్యాన్ని దెబ్బతీయవచ్చని వాదించగా, తమిళనాడు, కేరళ, పంజాబ్ వంటి రాష్ట్రాలు మాత్రం ప్రజాస్వామ్య బాధ్యత కోసం గవర్నర్, రాష్ట్రపతి నిర్ణయాలకు గడువులు అవసరమని నొక్కిచెప్పాయి. తుది తీర్పులో సుప్రీంకోర్టు ఏకంగా గవర్నర్, రాష్ట్రపతి అధికారాలపై స్పష్టతనివ్వడమే కాకుండా, బిల్లుల నిలిపివేతపై భవిష్యత్ లో అనుసరించాల్సిన మార్గదర్శకాలను కూడా తెలియజేసే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనప్పటికి దేశ వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారిన ఈ అంశంపై కోర్టు ఎటువంటి తీర్పు వస్తుందోనని ఎన్డీయే ఏతర రాష్ట్ర ప్రభుత్వాలు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నాయి.

## ఉద్యోగానికి భూమి కుంభకోణం

**ఢిల్లీ :** ఉద్యోగానికి భూమి కుంభకోణం కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు లో గత కొన్నేళ్లుగా కొనసాగుతున్న ఈ కేసులో మాజీ రైల్వే మంత్రి, ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్, ఆయన భార్య మాజీ బీహార్ ముఖ్యమంత్రి రబ్రీ దేవి, ప్రస్తుత బీహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ సహా పలువురిపై సీబీఐ దాఖలు చేసిన చార్జిషీట్ పై విచారణ జరిగింది. చార్జిషీట్ ను పరిశీలించిన కోర్టు అభియోగాలపై ఉత్తర్వులను రిజర్వ్ చేసింది . 2025 అక్టోబర్ 13న ఈ కేసులో తీర్పు వెలువడనుంది.లాలూ ప్రసాద్ యాదవ్ రైల్వే మంత్రిగా ఉన్న కాలంలో, రైల్వేలో ఉద్యోగాల నియామకాలకు ప్రతిఫలంగా బీహార్ లోని వివిధ ప్రాంతాల్లో భూములను తన కుటుంబ సభ్యుల పేర్లకు బదలాయింపులు చేయించుకున్నారని సీబీఐ ఆరోపిస్తోంది. ఈ వ్యవహారం వెలుగులోకి రావడంతో సీబీఐ విస్తృత దర్యాప్తు జరిపి, లాలూ కుటుంబ సభ్యులు సహా అనేక మందిపై కేసులు నమోదు చేసింది.కోర్టు ఉత్తర్వులను రిజర్వ్ చేయడంతో, ఈ కేసు ఏ మలుపు తిరుగుతుందో అన్న ఉత్కంఠ దేశవ్యాప్తంగా నెలకొంది. ఒకవేళ ఈ కేసులో లాలూ కుటుంబ సభ్యులు దోషులుగా రుజువైతే వారి రాజకీయ భవిష్యత్తుపై గణనీయమైన ప్రభావం చూపనుంది. అలాగే త్వరలో జరగనున్న బీహార్ ఎన్నికల్లో ఆర్జేడీతో పాటు ఇండియా కూటమి పరిస్థితులపై కూడా ఈ కేసు ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## బెంగళూరు బస్సులో ఘర్షణ

**కొట్టుకున్న డ్రైవర్-మహిళా ప్రయిణికురాలు**

**బెంగళూరు :** దేశంలో పలు రాష్ట్రాల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలవుతోంది. దీంతో బస్సులు కిక్కిరిసిపోతున్నాయి. చాలా చోట్ల కొట్లాటలు జరిగిన సందర్భాలు ఉన్నాయి. అలాగే డ్రైవర్లు, కండక్టర్లతో గొడవ పడిన దాఖాలు ఉన్నాయి. తాజాగా బెంగళూరులో ఇలాంటి ఘటనే వెలుగులోకి వచ్చింది. ఆపమన్న చోట బస్సు ఆపలేదని డ్రైవర్ పై మహిళా ప్రయాణికులు వాగ్వాదానికి దిగి దాడికి పాల్పడ్డారు. అంతే వేగంగా డ్రైవర్ కూడా రివర్స్ ఎటాక్ చేశాడు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.బెంగళూరులోని పీన్యా సమీపంలో తమకూరు రోడ్డులో బస్సు డ్రైవర్-మహిళా ప్రయాణికురాలి మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం భౌతికదాడులకు పాల్పడ్డారు. మాటలతో మొదలైన గొడవ అనంతరం ఒకరినొకరు చెంపదెబ్బలు కొట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన గొడవను బయట నుంచి ఒక వ్యక్తి మొబైల్ లో రికార్డ్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. ప్రస్తుతం వీడియో వైరల్ గా మారింది. అయితే ఈ వీడియోలో మహిళా ప్రయాణికులకు సహాయంగా తోటి ప్రయాణికులు కూడా తోడయ్యారు. అనంతరం కండక్టర్ కలుగజేసుకుని ఇరువర్గాలను శాంతింప జేశాడు.

## ముంచుకొస్తున్న జూబ్లీహిల్స్ బై పోల్..

**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** జూబ్లీహిల్స్ ఉప ఉన్నికపై ఇప్పటికే ప్రధాన పార్టీలు అలర్ట్ అయ్యాయి. ఈ మేరకు ముఖ్య నేతలు నియోజకవర్గంపై వరుసగా సమీక్షలు నిర్వహిస్తూ ఎన్నికలకు కేడర్ ను సమాయత్తం చేస్తున్నారు. అదేవిధంగా అభ్యర్థులు ఎంపికలో మాత్రం సస్పెన్స్ కొనసాగుతోంది. ఈ క్రమంలోనే ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇవాళ ఆయన హైదరాబాద్ లో మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ సరైన అభ్యర్థినే ఎంపిక చేస్తుందని ఆశిస్తున్నానని అన్నారు. ఇప్పుడున్న తాజా రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలవడం చాలా ముఖ్యమని అన్నారు. తనకు అవకాశం ఇస్తే.. జూబ్లీహిల్స్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తానని కామెంట్ చేశారు.కాగా, ఏఐసీసీ అగ్ర నేతలను ఎమ్మెల్యే దానం నాగేందర్ కలిసే అవకాశం ఉన్నట్లుగా సమాచారం. కేబినెట్ విస్తరణలో తనకు అవకాశం ఇవ్వాలని ఆయన కోరబోతున్నట్లుగా తెలుస్తోంది. ఇప్పటికే మూడు మంత్రి పదవులను ఇటీవల హైకమాండ్.. మిగిలిన పదవులను కూడా భర్తీ చేయడానికి కసరత్తు చేస్తున్న వేళ దానం ఢిల్లీకి వెళ్లాలని అనుకోవడం ప్రధాన్యతనను సంతరించుకుంది.

# విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తా..

**మంథని,ఫ్లాష్ ఇండియా :** మంథని ప్రాంతంలో విద్యారంగ అభివృద్ధికి సంపూర్ణ కృషి చేస్తామని రాష్ట్ర ఐ.టి, పరిశ్రమలు,శాసనసభ వ్యవహారాల శాఖా మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు. గురువారం మంథని ప్రాంతంలో మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి మంథని మున్సిపాలిటీలో విస్తృతంగా పర్యటించారు. మంథని మున్సిపాలిటీలో రూ.80 లక్షలతో నిర్మించనున్న నూతన ట్రాన్స్ ఫార్మర్ రిపేర్ సెంటర్ కు మంత్రి శంకుస్థాపన చేశారు. పట్టణంలో ఎంపీపీఎస్ బాలికల పాఠశాల లో టీచ్ ఫర్ చేంజ్ (మంచు లక్ష్మి ఫౌండేషన్) ఆధ్వర్యంలో డిజిటల్ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... పేదలకు నాణ్యమైన విద్య అందాలని స్వచ్ఛంద సంస్థ టీచ్ ఫర్ చేంజ్ ద్వారా సేవలు అందిస్తున్న మంచు లక్ష్మి, ఇతర ప్రతినిధులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. విద్య,వైద్య రంగాలలో స్పష్టమైన మార్పు తీసుకుని రావడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. మంథని నియోజకవర్గ పరిధిలో 6 ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ క్లాస్ రూమ్స్ ఏర్పాటుకు ముందుకు వచ్చిన టీచ్ ఫర్ చేంజ్ సంస్థకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సమాజంలో మంచి జరజరగాలని నిస్వార్ధంగా కృషి చేస్తున్న మంచు లక్ష్మి గారికి అభినందనలు తెలిపారు. విద్యా రంగంలో అభివృద్ధి కోసం ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు తమ సహకారం అందించడం సంతోషకరమని అన్నారు.విద్యతో విజ్ఞానం వస్తుందని,బాగా చదువుకున్న తర్వాత నాయకులుగా ఎదగడానికి ఆస్కారం ఉంటుందని అన్నారు. మంథని నియోజకవర్గం పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తామని అన్నారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ తరగతులు ఏర్పటు చేస్తూ పిల్లలకు మెరుగైన బోధన అందించేందుకు సహకారం అందిస్తున్న టీచ్ ఫర్ చేంజ్ సంస్థ స్థాపకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు డిజిటల్ తరగతులను, మూడు సంవత్సరాల వరకు టీచ్ ఫర్ చేంజ్ సంస్థ అందించే కరి కులం ను సద్వినియోగం చేసుకుంటూ పిల్లల్లో మంచి మార్పు తీసుకుని రావాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తుందని, అవసరమైన పాఠశాలల్లో ప్రహరీ గోడ, అదనపు తరగతులు, టాయిలెట్స్ అవసరమైన మరమ్మత్తు పనులు చేపట్టామని అన్నారు.టీచ్ ఫర్ చేంజ్ సంస్థ ప్రతినిధులు ప్రముఖ నటులు మంచు లక్ష్మి మాట్లాడుతూ.. మంథని లో 6 తరగతి గదులను డిజిటలైజ్ చేయడం జరిగిందని, ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో మొత్తం మా సంస్థ ద్వారా 51 తరగతి గదులలో డిజిటల్ సౌకర్యాలు కల్పించామని అన్నారు. తమ కుటుంబ నేపథ్యం విద్య రంగం నుంచి వచ్చిందని, తమ తాతగారు హెడ్ మాస్టర్ గా పని చేసేవారని తెలిపారు. మంచి నాణ్యమైన విద్య ప్రతి ఒక్కరికి అందాలనే లక్ష్యంతో టీచ్ ఫర్ చేంజ్ సంస్థ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.పిల్లలు మంచి నాయకత్వ లక్షణాలు, జీవితంలో ఒక మంచి లక్ష్యం కలిగి ఉండాలని అన్నారు.పిల్లలు అందరూ డాక్టర్లు,ఇంజనీర్ కలెక్టర్ వంటి పెద్ద స్థాయికి చేరుకోవాలని అన్నారు. మా సంస్థ సహకారంతో ఇక్కడి పాఠశాలల్లో మంచి మార్పులు వస్తే మరిన్ని పాఠశాలల్లో సదుపాయాల కల్పనకు ముందుకు వస్తామని అన్నారు.అనంతరం మంత్రి తన క్యాంపు కార్యాలయంలో విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్స్ , మంథని రామగిరి కమాన్ పూర్ మండలంలో ఎంపికైన 205 లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఇందిరమ్మ లబ్దిదారులు త్వరగా ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించుకోవాలని, ప్రతి సోమవారం లబ్ధిదారులకు ఇంటి నిర్మాణ పురోగతి ఆధారంగా నిధులు జమ చేయడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ నన్నయ గౌడ్, జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి, మంథని మార్కెటింగ్ కమిటీ చైర్మన్ వెంకన్న,ఆర్.డి.ఓ. సురేష్, సహకార సంఘ అధ్యక్షులు శ్రీనివాస్, తహసిల్దార్, ఎంపిడిఓ, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రూ.25 లక్షలతో ఉడాయించిన క్యాబ్ డ్రైవర్..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** సికింద్రాబాద్ సిటీ యూనియన్ బ్యాంకు మెయిన్ బ్రాంచి నుంచి బాలానగర్ బ్రాంచ్ సిబ్బంది డబ్బులు తెస్తుండగా క్యాబ్ డ్రైవర్ డబ్బుపెట్టెతో ఉడాయించాడు. ఈ ఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. బాలానగర్ సీఐ టి.నర్సింహరాజు తెలిపిన వివరాల ప్రకారం.. బాలానగర్ సిటీ యూనియన్ బ్యాంకుకు చెందిన క్లర్క్ నర్సింగ్ రావు, సెక్యూరిటీ గార్డు నాగేశ్వర్ డబ్బులు తెచ్చేందుకు బుధవారం మధ్యాహ్నం సికింద్రాబాద్ మెయిన్ బ్రాంచికి వెళ్లారు.బ్యాంకు నుంచి రూ.25లక్షల నగదు తీసుకుని బాలానగర్ బ్రాంచ్ వరకు టీఎస్ 10 యూబీ 4911 నంబరు గల క్యాబ్ లో వచ్చారు. అయితే బాలానగర్ చేరుకున్న తర్వాత క్యాబ్ డ్రైవర్ కు డబ్బులు ఇస్తుండగా అతడు డబ్బుపెట్టెతో ఉడాయుంచాడు.డబ్బుతో ఉడాయించిన క్యాబ్ డ్రైవర్ ను బ్యాంకు సెక్యూరిటీ గార్డు నాగేశ్వర్ ఆటోలో బోయినపల్లి వరకు వెంబడించాడు. ఆ తర్వాత కారు కనిపించలేదు. బ్రాంచి మేనేజర్ సందీప్ బాలానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

**సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు..**

బాలానగర్ బీబీఆర్ పక్కనున్న భారత్ లాడ్జ్ పక్క సందుగుండా నవజీవన్ నగర్ వైపు కారు వెళ్లిందని, అక్కడి నుంచి బాలానగర్ మెయిన్ రోడ్డు వైపు వచ్చినట్లు సీసీ ఫుటేజీ అధారంగా పోలీసులు గుర్తించారు. కారు నంబరు ప్రకారం క్యాబ్ డ్రైవర్ ఉస్మాన్ ఆలీ అని తేలినట్లు తెలిసింది. డ్రైవర్ కు గతంలో నేర చరిత్ర ఉన్నట్లుగా పోలీసులు అనుమాని స్తున్నారు. కేసు నమోదు చేసిన బాలానగర్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితుడిని పట్టుకునేందుకు సీసీఎస్ , ఎస్ వోటీ పోలీసులు కూడా గాలిస్తున్నట్లు సమాచారం.

# ప్రెషర్ కుక్కర్ తో తలపై కొట్టి చంపేశారు..

## అక్కడే స్నానం చేసి స్కూటీపై పరార్

- ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో రేణు అగర్వాల్ దారుణ హత్య
- కత్తులు, చాకులు, రైస్ కుక్కర్‌తో దాడి.. కిరాతకంగా హత్య
- జార్ఖండ్‌కు చెందిన హర్ష, రోషన్‌లపై పోలీసులు అనుమానం
- అనుమానితుల కోసం ఐదు ప్రత్యేక బృందాలతో గాలింపు ప్రారంభం
- ప్రెషర్ కుక్కర్ తో పాశవికంగా తలపై కొట్టి చంపిన వైనం
- ఇంట్లో పనిచేసే యువకుడే సూత్రధారి
- అక్కడే స్నానం చేసి స్కూటీపై పరారైన దుండగులు
- దోపిడీకి అడ్డువచ్చిందనే దారుణం!



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ కూకట్‌పల్లిలో వ్యాపారవేత్త భార్య రేణు అగర్వాల్ (45)ను దారుణంగా హత్య చేసిన ఘటన నగరాన్ని కలకలానికి గురిచేసింది. గురువారం సాయంత్రం ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. డీసీపీ బాలానగర్ వివరాల ప్రకారం, హత్యపై జార్ఖండ్ కు చెందిన హర్ష, అతని స్నేహితుడు రోషన్ లపై అనుమానం వ్యక్తమవుతోంది. ఘటన రోజు రేణు ఇంట్లో ఒంటరిగా ఉండగా ఈ హత్య జరిగినట్లు పోలీసులు చెబుతున్నారు.ఉదయం రేణు భర్త, కుమారుడు షాపుకు వెళ్లిపోయారు. సాయంత్రం నుండి రేణు ఫోన్ లిఫ్ట్ చేయకపో వడంతో భర్త ఆందోళన చెందారు. రాత్రి ఏడుగంటల సమయంలో ఇంటికి చేరి, వెనక తలుపు ద్వారా కార్మికునితో తలుపులు తెరిపించారు. ఇంట్లోకి వెళ్లినప్పుడు రేణు అగర్వాల్ ను హాల్ లో కాళ్లు, చేతులు తాళ్లతో బంధించి హత్య చేసిన స్థితిలో కనుగొన్నారు. కత్తులు, చాకులతో దాడి చేసి, గొంతు కోసి కిరాతకంగా హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. అంతేకాకుండా తలపై రైస్ కుక్కర్ తో కూడా కొట్టి చంపినట్లు సమాచారం.నెల రోజుల క్రితం హర్షను జార్ఖండ్ నుంచి సహాయకుడిగా తీసుకొచ్చారని పోలీసులు తెలిపారు. హర్ష, పై అంతస్తుల్లో ఉంటున్న రోషన్ తో స్నేహం పెంచుకున్నాడు. హత్య జరిగిన రోజే సాయంత్రం ఇద్దరూ కలిసి ఒక బ్యాగ్ తో బైక్ పై ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు ఆధారాలు లభించాయి. ఇంట్లో విలువైన వస్తువులు ఎలాంటి అవి మిస్సయ్యాయో ఇంకా స్పష్టత రాలేదు. ఇంట్లోకి కుటుంబ సభ్యులను పోలీసులు అనుమతించలేదు. ఈ కేసులో ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి హర్ష, రోషన్ లను పట్టుకునేందుకు కూకట్పల్లి పోలీసులు గాలిస్తున్నారు.

# మెదక్‌లో మరోసారి భారీ వర్షం..

## హైవేపై వరద, స్థానికులకు తీవ్ర ఇబ్బందులు

**మెదక్,ఫ్లాష్ ఇండియా :** మెదక్ జిల్లా కేంద్రంలో మరోసారి కుండపోత వర్షం కురిసింది. కేవలం రెండు గంటల వ్యవధిలోనే ఏకంగా 7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కావడంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. ఈ అకాల వర్షం స్థానికులకు తీవ్ర ఇబ్బందులు సృష్టించింది. గత కొన్ని వారాలుగా కురుస్తున్న వర్షాల నుంచి ఇంకా పూర్తిగా తేరుకోకముందే, మెదక్ లో మరో భారీ వర్షం సంభవించింది. దీంతో ఇప్పటికే నీటిలో ఉన్న అనేక కాలనీలు, లోతట్టు ప్రాంతాలు మరింతగా మునిగిపోయాయి.ఇళ్లలోకి వరద నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ వర్షం కారణంగా మెదక్-హైదరాబాద్ నేషనల్ హైవేపై ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పట్టణం వెల్ కం బోర్డు వద్ద భారీగా వరద నీరు నిలిచిపో వడంతో వాహనదారులు ముందుకు వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి.ఇటీవల కురిసిన వర్షాలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న స్థానికుల్లో ఈ తాజా వర్షం మరింత ఆందోళన కలిగించింది. సరైన పారిశుధ్య వ్యవస్థ లేకపోవడం, వరద నీరు వెళ్లేందుకు మార్గాలు లేకపోవడం వల్ల ప్రతి వర్షానికి ఇదే పరిస్థితి ఎదురవుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు కోరుకుంటున్నారు. ప్రస్తుతం, వరద నీరు తగ్గుముఖం పట్టడానికి సమయం పడుతుంది, అంతవరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

# ప్రజాసేవ చేసే వారిని ఆదరించండి



**ఆర్.కే పురం, డివిజన్ ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** ప్రజా సేవ చేసే వారిని ప్రజలు ఎన్నికలలో ఆదరించాలని మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, పిసిసి సభ్యులు దేప భాస్కర్ రెడ్డి అన్నారు. ఆర్ కె పురం డివిజన్ లోని మార్గదర్శి కాలనీ కమ్యూనిటీ హాల్, టెలిఫోన్ కాలనీ పార్కులో వాకర్స్, సీనియర్ సిటిజన్స్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక మధుర ఉపేందర్ రెడ్డి తమ స్వంత నిధులతో నిర్మించిన వాష్ రూమ్స్ ను వారు ప్రారంభించి మాట్లాడారు. రాబోయే రోజులలో మరింత విస్తృతస్థాయిలో సేవ చేయడానికి మధుర ఉపేందర్ రెడ్డికి అవకాశం ఇవ్వాలని కోరారు. ఈకార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్ నేత, గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి మధుసూధన్ రావు, నల్లెంకి ధనరాజ్ గౌడ్, శ్రీఖిల్లా మైసమ్మ దేవాలయం ఛైర్మెన్ కుంచారపు సురేంద్ర కుమార్, కాలనీ సంక్షేమ సంఘాల అధ్యక్షులు ఎలిమినేటి సంజీవరెడ్డి, రమణయ్య, జి. వెంకట్ రెడ్డి, ప్రధాన కార్యదర్శులు యస్. రాములు గౌడ్, మధుసూదన్, యన్. శివలింగం గౌడ్, రామ్మూర్తి, వరాల పుష్పలత మోహన్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, బి. మధుసూదన్, వాసు తదితరులు పాల్గొన్నారు.

# 200 వందల మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

**ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీలు శంకర్ నాయక్, శ్రీపాల్ రెడ్డి,జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్,సబ్ కలెక్టర్ నారాయణ అమిత్,డిఎస్పి రాజశేఖర్ రాజు**





**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్వీ గార్డెన్స్ నందు గురుపూజోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం బుధవారం సాయంత్రం నిర్వహించడం జరిగింది. మిర్యాలగూడ నియోజకవర్గంలోని మిర్యాలగూడ,వేములపల్లి,మాడుగుల పల్లి,దామరచర్ల,అడవిదేవులపల్లి మండలాలకు చెందిన సుమారు 200 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి ముఖ్య అతిథులైన ఎమ్మెల్సీ శంకర్ నాయక్,శ్రీపాల్ రెడ్డి,నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్,మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్,డిఎస్పి రాజశేఖర్ రాజు మరియు ఆయా మండలాల విద్యాధికారుల చేతుల మీదుగా మెమొంటోలను, ప్రశంస పత్రములను ఇచ్చి ఘనంగా సన్మానం చేయడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులే భావిభారత పౌరుల భవిష్యత్తు నిర్మాణానికి తొలిమెట్టని,విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయుల దేనని,ప్రతి ఉత్తమ ప్రభుత్వ అధికారి ఒక ఉపాధ్యాయుడికి శిష్యుడేనని వారు అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూ సమీకృత పాఠశాల విద్యా వ్యవస్థకు నా వంతు కృషి నేను చేస్తానని ఉపాధ్యాయులు కూడా అందుకు పూర్తిగా సహకరించాలని కోరారు. కార్పొరేటు విద్యకు దీటుగా ప్రభుత్వ పాఠశాలను తయారు చేయడానికి తెలంగాణ ప్రభుత్వం ముందుకు వస్తుందని అందుకు ఉపాధ్యాయులు తమ వంతు బాధ్యతగా ముందుకు రావాలని కోరారు. నియోజకవర్గ అభివృద్ధిలో ఉపాధ్యాయులు భాగస్వాములు కావాలని కోరారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత సెయింట్ మేరీస్ హై స్కూల్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ విద్య సంపత్ మాట్లాడుతూ నా యొక్క 37 సంవత్సరాల టీచింగ్ అనుభవంలో ఉపాధ్యాయులను ఇంతగా గౌరవించేటువంటి మంచి మనసున్న ఎమ్మెల్యే మన నియోజకవర్గానికి దొరకడం ఎంతో అదృష్టమని,నాకు ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డు రావడం తోపాటు నియోజకవర్గంలోని పలువురు ఉపాధ్యాయుని,ఉపాధ్యాయుల సమక్షంలో ఘన సన్మానం చేయడం ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు.ఈ కార్యక్రమంలో పలు మండల ల విద్యాధికారులు బాలు నాయక్, లక్ష్మణ్ నాయక్,బాలాజీ నాయకులు పాల్గొన్నారు.

# మిర్యాలగూడ లో ఏఐ టెక్నాలజీతో ఎక్స్ రే యంత్రం





**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** మిర్యాలగూడ రైస్ అండ్ ఆయిల్ మిల్లర్స్ అసోసియేషన్ వారు మొబైల్ ఎక్స్-రే ను బహుకరించడం జరిగింది. ఈ ఎక్స్ రే యంత్రం ను మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి,సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ ల చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మొదట బాలాజీ రైస్ మిల్స్ ప్రైవేట్ లిమిటెడ్,బాదలాపురం. మిల్లులో పనిచేయు కార్మికులు 30 మందికి ఎక్రేలు తీసి వారికి ఐదు నిమిషాలలో రిపోర్టు అందించడం జరిగింది.ఇట్టి మొబైల్ ఎక్స్- రే ఏఐ టెక్నాలజీతో రూపొందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ రైస్ అండ్ ఆయిల్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు,ఆశా కార్యకర్తలు,హమాలీ కార్మికులు,తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ స్కూల్ టీచర్ లకు జీతాలు పెంచాలి

**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రైవేట్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు జీతాలు పెంచాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు విజ్ఞప్తి చేశారు.ఎక్కువ పని తక్కువ జీతంతో ఎవరైనా పని చేస్తున్నారు అంటే ఆది కేవలం ప్రైవేట్ ఉపాధ్యాయులేనని అన్నారు.పెరిగిన ధరలతో చాలీచాలని జీతాలతో ప్రైవేట్ ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు,అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఉదయం నుంచి సాయంత్రం వరకు తరగతి గదులకే పరిమితమై భోదనలు అందిస్తున్నప్పటికీ వారికి జీతం 15 వేల నుంచి 20 వేలు మాత్రమే ఇస్తున్నారని విద్యార్థుల దగ్గర నుండి వేల రూపాయలు వసూలు చేస్తూ ఉపాధ్యాయులకు జీతాలు పెంచేందుకు మాత్రం మనసు రావడంలేదని అన్నారు.వారికి కనీస వేతనం నెలకు 30 వేల రూపాయలు ఇవ్వాలని కోరారు .

# మ్యాన్ హోల్‌లో పడిపోయిన ఐదేళ్ల బాలిక..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** యాకత్ పురాలో చోటు చేసుకున్న ఓ ప్రమాదకర సంఘటనపై చార్మినార్ జోనల్ కమిషనర్ స్పందించారు. మౌలాకా చిల్లా ప్రాంతానికి చెందిన ఐదేళ్ల బాలిక ఓపెన్ గా ఉన్న మ్యాన్ హోల్ లో పడిపోయిన ఘటన స్థానికులను, అధికారులను ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసింది. అయితే, అదృష్టవశాత్తూ అక్కడే ఉన్న స్థానికులు వెంటనే స్పందించి ఆ చిన్నారిని బయటకు తీశారు. ఈ ఘటనలో బాలికకు ఎలాంటి తీవ్రమైన గాయాలు కాక పోవడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు.ఈ విషయం తెలిసిన వెంటనే లోకల్ డిప్యూటీ కమిషనర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం చిన్నారి నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిపై సమాచారం తెలుసుకున్నారు. ప్రస్తుతం ఆ బాలిక సురక్షితంగా ఉన్నట్లు తెలుస్తోంది.కాగా, నిన్న హైడ్రా సిబ్బంది మ్యాన్ హోల్ ను శుభ్రం చేసిన తర్వాత, తిరిగి మూయకుండా అక్కడి నుంచి వెళ్లినట్టు తెలుస్తోంది. ఈ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఘటనను హైడ్రా అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్టు చార్మినార్ జోనల్ కమిషనర్ తెలిపారు. ఇలాంటి అవాంఛనీయ ఘటనలు మళ్లీ ఎక్కడా జరగకుండా చర్యలు తీసుకుంటామని, సంబంధిత శాఖలకు ఆదేశాలు జారీ చేసినట్టు పేర్కొన్నారు.

# పప్స్ అడాప్షన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి..




**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** నల్గొండ జిల్లా కలెక్టరేట్ నందు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మరియు అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) లు సంయుక్తంగా గురువారం ఒక ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించడం జరిగింది,ఈనెల 13.09.2025 (శనివారం) నాడు ఉదయం గం 7.00 లకు మున్సిపల్ పార్క్, నల్గొండ లో జరగబోయే పప్స్ అడాప్షన్ కార్యక్రమం గురించి వివరించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూఈ కార్యక్రమం ముఖ్య లక్ష్యం జంతువుల పట్ల కరుణాభావాన్ని పెంపొందించడం,అలాగే పెంపుడు జంతువులను కొనుగోలు చేయకుండా అనాథ కుక్క పిల్లలను దత్తత తీసుకోవడం యొక్క ప్రాధాన్యంపై ప్రజల్లో అవగాహన కల్పించడం జరుగుతుంది అన్నారు.ఈ కార్యక్రమానికి సమస్త పౌరులు,ప్రజాప్రతినిధులు, అధికారులు,స్వచ్ఛంద సంస్థలు, జంతు ప్రేమికులు హాజరై తమ సహకారం అందించి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# కేసీఆర్ పాటలకు స్టెప్పులేస్తే జైల్లో పెడతారా?




**ఆర్మూర్,ఫ్లాష్ ఇండియా :** 'కేసీఆర్ పాటలకు స్టెప్పులేస్తే జైల్లో పెడతారా? ఇదెక్కడి పోలీసింగ్ సీపీ గారు' అని బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి నిలదీశారు. నిజామాబాద్ సీపీ కాంగ్రెస్ నేతల కనుసన్నల్లో పనిచేస్తూ చట్టాన్ని తుంగలో తొక్కుతున్నారని గురువారం జీవన్ రెడ్డి మండిపడ్డారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ మీద ఉన్న అభిమానంతో డీజే పెట్టి డాన్స్ లు వేశారని తెలిపారు. 'మళ్ళీ సారే రావాలి, కేసీఆరే రావాలి' అని యువకులు కేరింతలు కొట్టారని ఆయన పేర్కొంటూ ఇది ఏ చట్ట ప్రకారం నేరం? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ కనుసన్నల్లో పని చేస్తున్న మీకు కేసీఆర్ పాటకు ఆడటం ఘోరంగా కనిపించిందా? అని ఆయన నిజామాబాద్ సీపీని ప్రశ్నించారు.ఈ సందర్భంగా జీవన్ రెడ్డి గణేష్ నిమజ్జనం రోజు తీసిన వీడియో చూపించి ఇందులో చట్ట ఉల్లంఘన ఎక్కడుందో సీపీ చెప్పాలన్నారు. కేసీఆర్ పాటలతో 10 డీజేలు పెట్టారని పది అక్రమ కేసులు పెట్టడాన్ని ప్రజాపాల అంటారా? అని ఆయన ధ్వజమెత్తారు.ఇది అంబేద్కర్ రాజ్యాంగమా? లేక కాంగ్రెస్ రాజ్యాంగ మా?, హింసాత్మక ఇందిరమ్మ రాజ్యం లో తెలంగాణ ప్రజలు బతికే స్వేచ్ఛ లేదా అని జీవన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత యువకుడు రోహిత్ పై నాన్ బెయిల్ బుల్ కేసులు దారుణ మన్నారు. పోలీసు శాఖ కాంగ్రెస్ కు అనుబంధ విభాగంగా మారిందని ఆయన ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ కనుసన్నల్లో పని చేస్తున్న నిజామాబాద్ సీపీ అకృత్యాలకు అదుపు లేకుండా పోయిందన్నారు.గన్ మెన్లను తొలగించి తనకు రక్షణ లేకుండా చేశారని, రెండు సార్లు ఎమ్మెల్యేగా పనిచేసి ప్రధాన ప్రతిపక్ష బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడుగా ఉన్న తాను ప్రజా సమస్యలపై ఫోన్ చేసినా సీపీ లిఫ్ట్ చేయకపోవడం విచారకరమని జీవన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. 'అధికార పార్టీ అండదండలతో తెల్లార్లు పేకాట క్లబ్ లు జోరుగా నడుస్తున్నాయి. ఎక్కడ పడితే అక్కడ మట్కా జూదం మాడతున్నారు. విచ్చల విడిగా గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయి. 20 ఏండ్లు నిండిన యువకులంతా గంజాయి మత్తులో ఊగుతుండ్రు. నల్లమట్టి స్మగ్లింగ్ గత ఎండాకాలంలో సాగింది.. వాటిని అరిక ట్టకుండా కేసీఆర్ ను అభిమానించే వారిపై కేసులు పెట్టడం మీ పోలీసుశాఖకు సిగ్గు అనిపించడం లేదా? జీవన్ రెడ్డి నిప్పులు చెరిగారు.పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి లకు తొత్తులుగా మారిన కొందరు పోలీస్ అధికారుల అరాచకాలపై ప్రజలు ఉద్యమించాలని జీవన్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ నేతల సేవలో తరిస్తున్న పోలీసు అధికారుల పేర్లు పింక్ బుక్ లో ఎక్కిస్తున్నామని, వచ్చేది కేసీఆర్ ప్రభుత్వ మేనని వారు ఎక్కడున్నా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని జీవన్ రెడ్డి హెచ్చరించారు. రోహిత్ నిర్బంధంపై ఎన్ హెచ్ ఆర్ సీ, జాతీయ ఎస్సీ కమిషన్ లో ఫిర్యాదు చేస్తానని ఆయన వెల్లడించారు. నిజామాబాద్ జిల్లా పోలీసులు చట్టవిరుద్ధ చర్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వస్తామని ఆయన తెలిపారు. నిజామాబాద్ జిల్లాలో ఐపీఎస్ అధికారుల నిర్వాకం పై సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ కు కూడా ఫిర్యాదు చేస్తామని జీవన్ రెడ్డి వెల్లడించారు.

# మిర్యాలగూడ మున్సిపల్ మాజీ చైర్మన్ భార్గవ్ ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే నల్లమోతు



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** మిర్యాలగూడ పట్టణ మాజీ మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ మాతృమూర్తి తిరునగరు మల్లేశ్వరమ్మ బుధవారం ఉదయాన్నే స్వర్గస్తులైనారు. వారి కుటుంబ సభ్యులు అమెరికాలో ఉండటం వలన వారి పార్థివ దేహాన్ని నార్కెట్ పల్లి లో గల కామినేని ఆసుపత్రి నందు భద్రపరిచారు. ఈ విషయం తెలిసిన మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు దంపతులు గురువారం షాబునగర్ లోని వారి స్వగృహంనకు వెళ్లి సతీసమేతంగా తిరునగరు భార్గవ్ ని పరామర్శించారు.వారితో పాటు మహిముద్,ఖాదర్, గోవింద్ రెడ్డి,బాబ్జి తదితరులు ఉన్నారు.

# బుమ్రా సూపర్ యార్కర్..



అనుకున్నట్టుగానే టీమిండియా ఆసియా కప్ లో తన ప్రతాపం చూపించింది. అటు బౌలింగ్ లోనూ, ఇటు బ్యాటింగ్ లోనూ ఆధిపత్యం ప్రదర్శించి సత్తా చాటింది. యూఏఈ నిర్దేశించిన లక్ష్యాన్ని ఐదు ఓవర్ల లోపే ఛేదించింది. ఇంగ్లండ్ పర్యటనలో పూర్తి మ్యాచ్ లు ఆడలేకపోయిన జస్ప్రీత్ బుమ్రా ఆసియా కప్ లో అదరగొట్టాడు. తన వేగవంతమైన యార్కర్లతో యూఏఈ బ్యాటర్లను బెంబేలెత్తించాడు.ఆసియా కప్ 2025లో భాగంగా భారత జట్టు తమ తొలి మ్యాచ్ లో సెప్టెంబర్ 10 బుధవారం దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియంలో యూఏఈతో తలపడింది. బుమ్రా తొలి 10 బంతుల్లోనే టీం ఇండియా తరఫున తొలి వికెట్ తీసుకున్నాడు. అద్భుతమైన యార్కర్ తో బోణీ చేశాడు. బుమ్రా వేసిన యార్కర్ కు యూఏఈ ఓపెనర్ అలీషాన్ షరాఫు షాకయ్యాడు. అతడు బ్యాట్ పెట్టే లోపు ఆఫ్ వికెట్ పడిపోయింది.2024 టీ20 ప్రపంచ కప్ ఫైనల్ తర్వాత బుమ్రా టీమిండియా తరఫున ఆడిన తొలి అంతర్జాతీయ టీ-20 మ్యాచ్ ఇదే. కాగా, బుధవారం యూఏఈతో జరిగిన మ్యాచ్ లో టీమిండియా తొమ్మిది వికెట్ల తేడాతో గెలుపొందింది. ఈ టోర్నీలో భాగంగా తమ తర్వాతి మ్యాచ్ ను పాకిస్థాన్ తో ఆదివారం ఆడబోతోంది. ఈ మ్యాచ్ పై ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రీడాభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే ఈ మ్యాచ్ కు సంబంధించిన టికెట్లు హాట్ కేక్ ల్లా అమ్ముడు పోయాయి.

# సింధు పరాజయం

రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత పీవీ సింధుకు హాంకాంగ్ ఓపెన్ లో చుక్కెదురైంది. ఈ భారత స్టార్ అనూహ్యంగా



ఆదిలోనే అన్ సీడెడ్ చేతిలో పరాజయం పాలై నిరాశపరచింది. డెన్మార్క్ కు చెందిన క్రిస్టోఫర్సెన్ 15-21, 21-16, 21-19తో సింధుకు షాకిచ్చి ప్రీక్వార్టర్స్ కు దూసుకెళ్లింది. పురుషుల సింగిల్స్ లో లక్ష్యసేన్ 22-20, 16-21, 21-15తో తైపీ ఆటగాడు వాంగ్ జు వీపై, ప్రణయ్ 21-17, 21-14తో చైనా షట్లర్ లూ గువాంగ జూపై, ఆయుష్ శెట్టి 15-21, 21-19, 21-13తో సూ లి యాంగ్ (తైపీ)పై, కిరణ్ జార్జ్ 21-16, 21-11తో జియా హెంగ్ జాసన్ తె (సింగపూర్ )పై గెలిచి ప్రీక్వార్టర్స్ లో అడుగుపెట్టారు. మహిళల డబుల్స్ లో రీతుపర్ణ పండా/శ్వేతపర్ణ పండా జోడీ 21-17, 21-9తో స్థానిక జంట వానెస్సా పాంగ్ /సమ్ యూ వాంగ్ పై గెలిచి ప్రీక్వార్టర్స్ లో ప్రవేశించింది. సింగిల్స్ లో రక్షిత రామరాజు, అనుపమ ఉపాధ్యాయ, మిక్స్ డ్ డబుల్స్ లో తనీషా/ధ్రువ్ కపిల, రుత్వికా శివాని/రోహన్ కపూర్ ద్వయం జోడీలు ప్రత్యర్థుల చేతిలో ఓటమిపాలై టోర్నీ నుంచి నిష్క్రమించారు.



# క్వార్టర్ ఫైనల్‌లో ఓటమి

తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్ వరల్డ్ చాంపియన్ హోదాను కాపాడుకోలేక పోయింది. ఇంగ్లాండ్ లో జరుగుతున్న వరల్డ్ చాంపియన్ షిప్ లో క్వార్టర్ ఫైనల్ లోనే ఇంటిదారిపట్టింది. 51 కేజీల కేటగిరీలో పోటీ పడిన ఆమె క్వార్టర్ ఫైనల్ లో తుర్కియేకు చెందిన కాకిరోగ్లు బుసె నాజ్ చేతిలో 5-0 తేడాతో పరాజయం పాలైంది. మూడు రౌండ్లలోనూ ప్రత్యర్థిని నిఖత్ నిలువరించలేకపోయింది. వరుసగా 2022, 2023లలో వరల్డ్ చాంపియన్ గా నిలిచిన నిఖత్ కనీసం కాంస్య పతకం కూడా సాధించకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. మరోవైపు, భారత బాక్సర్లు నుపూర్ షెయోరాన్(80+ కేజీలు), జైస్మిన్(57 కేజీలు) పతకం ఖాయం చేసుకున్నారు. తమ విభాగాల్లో వీరు సెమీస్ కు దూసుకెళ్లారు. క్వార్టర్ ఫైనల్ లో నుపూర్ 4-1 తేడాతో ఉజ్బెకిస్తాన్ కు చెందిన ఒల్టినోయ్ సోటింబోవాపై గెలుపొందింది. జైస్మిన్ 5-0 తేడాతో ఉజ్బెకిస్తాన్ కే చెందిన మామాజొనోవా ఖుమోరాబోను పై విజయం సాధించింది.

# చెలరేగిన కుల్దీప్, దూబే..



ఆసియా కప్ 2025లో భాగంగా దుబాయ్ వేదికగా భారత్ తో జరుగుతోన్న మ్యాచ్ లో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) స్వల్ప స్కోరుకే ఆలౌట్ అయింది. భారత బౌలర్ల దెబ్బకు 13.1 ఓవర్లలో 57 పరుగులకే యూఏఈ కుప్పకూలింది. ఓపెనర్లు అలిషామ్ స్కార్ఫ్ (22), ముహమ్మద్ వసీమ్ (19) టాప్ స్కోరర్లు. మిగతా యూఏఈ బ్యాటర్లు సింగిల్ డిజిట్ కే పరిమితమయ్యారు. 3 కంటే ఎక్కువ పరుగులు ఎవరూ చేయకపోవడం విశేషం. భారత బౌలర్లలో కుల్దీప్ యాదవ్ 4, శివమ్ దూబే 3 వికెట్స్ పడగొట్టారు.టాస్ ఓడి బ్యాటింగ్ కు దిగిన యూఏఈకి ఆదిలోనే షాక్ తగిలింది. దూకుడుగా ఆడుతున్న అలిషామ్ ను జస్ప్రీత్ బుమ్రా అవుట్ చేశాడు. ఆ వెంటనే ముహమ్మద్ జోహైబ్ (2), రాహుల్ చోప్రా (3)లను వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్ పెవిలియన్ చేర్చారు. వసీమ్ ను కుల్దీప్ బుట్టలో వేశాడు. ఆపై శువం దూబే విరుచుకుపడ్డాడు. భారత బౌలర్ల దెబ్బకు యూఏఈ బ్యాటర్లు వరుసగా పెవిలియన్ కు క్యూ కట్టారు. అందరూ ఇలా వచ్చి అలా వెళ్లిపోయారు. కుల్దీప్ 4, శివమ్ 3 వికెట్లు తీయగా.. బుమ్రా, అక్షర్ , వరుణ్ తలో ఒక్కో వికెట్ పడగొట్టారు. భారత్ లక్ష్యం 58 పరుగులు.

# ఇండియా, పాక్ మ్యాచ్ జరిగి తీరుతుంది



ఆసియా కప్ 2025లో భాగంగా భారత్ vs పాకిస్తాన్ తలపడనున్న మ్యాచ్ ను రద్దు చేయాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పీఐఎల్)ను సుప్రీంకోర్టు కొట్టేసింది. ఈ పిటిషన్ను అత్యవసరంగా విచారించడానికి దేశ అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. షెడ్యూల్ ప్రకారం ఇండియా, పాకిస్థాన్ మ్యాచ్ జరగాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆసియా కప్లో ఇండియా, పాక్ మ్యాచ్ రద్దు చేయాలని కోరుతూ నలుగురు లా విద్యార్థులు పిల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.పహల్గాంలో ఉగ్రదాడికి ప్రేరేపించిన పాకిస్థాన్తో క్రికెట్ మ్యాచ్ జాతీయ గౌరవం, ప్రజల భావోద్వేగాలకు విరుద్ధంగా సందేశాన్ని పంపుతోందని పేర్కొన్నారు. ఈ మ్యాచ్ పాకిస్తానీ ఉగ్రవాదుల చేతిలో ప్రాణాలు కోల్పోయిన బాధితుల కుటుంబాల మనోభావాలను కూడా దెబ్బతీస్తుందని.. అలాగే ప్రాణాలు ఫణంగా పెట్టి పోరాడిన సైనికుల త్యాగాలకు విలువ లేకుండా పోతుందన్నారు. దేశ గౌరవం, పౌరుల భద్రత వినోదం కంటే ముఖ్యమైనది కాదని పిటిషన్లో పేర్కొన్నారు. ఈ పిటిషన్ను అత్యవసరంగా విచారించాలని కోరారు. న్యాయమూర్తులు జెకె మహేశ్వరి, విజయ్ బిష్ణోయ్ లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ పిటిషన్ను అత్యవసరంగా విచారించడానికి నిరాకరించింది. ఈ పిల్ను అంత అత్యవసరంగా విచారించాల్సిన అవశ్యకత ఏంటని ప్రశ్నించింది. అది ఒక మ్యాచ్ అని.. ఆటను ఆటలాగే చూడాలని పేర్కొంది. ఇండియా, పాక్ మ్యాచ్ షెడ్యూల్ ప్రకారం జరగాలని స్పష్టం చేసింది. పహల్గాం టెర్రరిస్ట్ ఎటాక్, ఆపరేషన్ సిందూర్ తర్వాత ఇండియా, పాక్ మ్యాచ్ లపై కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేసింది. ఇండియా, పాకిస్తాన్ మధ్య ద్వైపాక్షిక మ్యాచ్ లు జరగవని తేల్చిచెప్పింది. ఐసీసీ టోర్నీలు, ఆసియా కప్ వంటి బహుళ పక్ష టోర్నీల్లో మాత్రం పాకిస్థాన్ తో తలపడటానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇందులో భాగంగానే ఆసియా కప్ లో పాక్ తో మ్యాచ్ ఆడేందుకు బీసీసీఐ అంగీకరించింది. ఆసియా కప్ లో భాగంగా 2025, సెప్టెంబర్ 14 చిరకాల ప్రత్యర్థులు ఇండియా, పాకిస్థాన్ తలపడనున్నాయి. ఈ మెగా ఫైట్ కోసం యావత్ క్రికెట్ ఫ్యాన్స్ ఎంతో ఆతృతగా ఎదురు చూస్తున్నారు.



## అభిషేక్ శర్మ అరుదైన రికార్డు!

ఆసియా కప్ 2025లో భాగంగా బుధవారం యూఏఈతో జరిగిన మ్యాచ్ లో భారత్ ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్ లో ముందుగా బ్యాటింగ్ చేసిన యూఏఈ 57 పరుగులకే ఆలౌటైంది. అనంతరం స్వల్ప లక్ష్యాన్ని భారత్ మరో 93 బంతులు మిగిలిఉండగానే విజయం సాధించింది. అభిషేక్ శర్మ (30: 16 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్ లు), శుభ్ మన్ గిల్ (20 నాటౌట్)లు రెచ్చిపోయారు. ఈ మ్యాచ్ ద్వారా అభిషేక్ ఓ అరుదైన రికార్డును ఖాతాలో వేసుకున్నాడు.టీ20ల్లో లక్ష్య ఛేదనలో మొదటి బంతికే సిక్స్ కొట్టిన తొలి భారత బ్యాటర్ గా అభిషేక్ శర్మ అరుదైన ఘనత ఖాతాలో వేసుకున్నాడు. యూఏఈ బౌలర్ హైదర్ అలీ వేసిన తొలి బంతినే సిక్స్ గా మలిచి ఈ ఫీట్ అందుకున్నాడు. 2021కి ఇంగ్లండ్ పై రోహిత్ శర్మ, 2024లో జింబాబ్వేపై యశస్వి జైస్వాల్, 2025లో ఇంగ్లండ్ పై సంజు శాంసన్ తొలి బంతినే సిక్స్ గా మలిచినా.. వీరంతా భారత్ తొలుత బ్యాటింగ్ చేసినప్పుడు కొట్టారు.

మొదటి బంతికే సిక్స్ కొట్టిన భారత బ్యాట్స్ మెన్ లిస్ట్:

రోహిత్ శర్మ vs ఆదిల్ రషీద్, అహ్మదాబాద్, 2021
యశస్వి జైస్వాల్ vs సికందర్ రజా, హరారే, 2024
సంజు శాంసన్ vs జోఫ్రా ఆర్చర్, ముంబై, 2025
అభిషేక్ శర్మ vs యుఏఈ, దుబాయ్, 2025


# బిజినెస్

# హై స్పీడ్ ఇంటర్నెట్ వచ్చేస్తోంది..




టెస్లా సీఈఓ ఎలోన్ మస్క్ సాటిలైట్ ఇంటర్నెట్ సంబంధించి గుడ్ న్యూస్ చెప్పారు. మొబైల్ ఫోన్లు ఇప్పుడు డైరెక్ట్ సాటిలైట్కి కనెక్ట్ అయ్యేల కొత్త చిప్ సెట్ తయారుచేసేందుకు స్పేస్ ఎక్స్, స్టార్ లింక్ కలిసి పనిచేస్తున్నాయని చెప్పారు. దింతో ప్రజలు జియో, ఎయిర్ టెల్ వంటి లోకల్ నెట్ వర్క్ పై ఆధారపడకుండా ఇక ప్రపంచంలో ఎక్కడి నుండైన హై-స్పీడ్ ఇంటర్నెట్ పొందోచ్చు. కాలిఫోర్నియాలో జరిగిన ఆల్-ఇన్ సమ్మిట్ లో ఎలోన్ మస్క్ మాట్లాడుతూ ఈ చిప్ సెట్ దాదాపు రెండు ఏళ్లలో రెడీ అవుతుందని, ఈ టెక్నాలజీతో ప్రజలు ఎక్కడ ఉన్నా, వారి ఫోన్ లో వీడియోలు, సినిమాలు స్ట్రీమ్ చేయొచ్చని ఇంకా ఇంటర్నెట్ ఈజీగా ఉపయోగించుకోవచ్చని అన్నారు. సాటిలైట్ నుండి ఇంటర్నెట్ మీకు ఎలా వస్తుంది: భూమి మీద ఎక్కడి నుండైనా ఇంటర్నెట్ కవరేజీ కోసం ఉపగ్రహాలు(సాటిలైట్) ఉపయోగపడతాయి. ఇది చాలా వేగంగా, తక్కువ జాప్యం ఉన్న ఇంటర్నెట్ ను అందిస్తుంది. జాప్యం అంటే డేటా ఒక చోటి నుండి మరొక చోటికి వెళ్ళడానికి పట్టే సమయం.ప్రస్తుతం, స్టార్ లింక్ కిట్ లో స్టార్ లింక్ డిష్, వైఫై రౌటర్, పవర్ సప్లయ్ కేబుల్స్, మౌంటింగ్ ట్రైపాడ్ ఉంటాయి. హై-స్పీడ్ ఇంటర్నెట్ కోసం డిష్ ని ఆకాశం కనిపించే చోట పెట్టాలి. ఈ స్టార్ లింక్ యాప్ iOS, Androidలో కూడా ఉంది, ఇది సెటప్ నుండి మొత్తం ప్రతిదీ చూసుకుంటుంది.మొబైల్ ఫోన్ ల కోసం కొత్త చిప్ అందుబాటులోకి వస్తే స్టార్ లింక్ కిట్ అవసరం ఉండదు. ఈ కొత్త చిప్ ఫోన్ లను డైరెక్ట్ స్టార్ లింక్ ఉపగ్రహాలకు కనెక్ట్ చేస్తుంది. దీనివల్ల మీరు ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా వీడియోలు చూడవచ్చు, గేమ్స్ ఆడవచ్చు ఇంకా వీడియో కాల్స్ చేసుకోవచ్చు అని ఎలాన్ మస్క్ చెప్పారు.కొత్త చిప్ ఉన్న ఫోన్లు దాదాపు రెండు ఏళ్లలో మార్కెట్లోకి రావొచ్చు. అయితే ఈ చిప్ సెట్ ప్రత్యేక ఫ్రీక్వెన్సీపై పనిచేస్తుంది, దీని కోసం మనం ఇంకా కొన్ని పనులు చేయాల్సి ఉంది. అంటే 2027 నాటికి ఈ టెక్నాలజి అందుబాటులోకి రావచ్చు చెప్పారు.స్టార్ లింక్ స్పేస్ ఎక్స్ ప్రత్యేక ప్రాజెక్ట్: స్టార్ లింక్ అనేది స్పేస్ ఎక్స్ ప్రాజెక్ట్, ఇది శాటిలైట్ల ద్వారా హై-స్పీడ్ ఇంటర్నెట్ అందిస్తుంది. దీని ఉపగ్రహాలు భూమికి దగ్గరగా కక్ష్యలో తిరుగుతాయి, ఇది ఇంటర్నెట్ ను వేగంగా అలాగే సులభంగా చేస్తుంది. మారుమూల గ్రామాలు ఇంకా ఎత్తైన పర్వతాలు వంటి ఇంటర్నెట్ చేరుకోని ప్రాంతాలలో ఇది చాలా ఉపయోగపడుతుంది.

# ఫ్లాట్‌గా కదలాడుతున్న స్టాక్ మార్కెట్లు..




గత మూడు రోజులుగా వరుస లాభాలు అందుకుంటున్న దేశీయ సూచీలు గురువారం కాస్త నెమ్మదించాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను ప్రకటించనుండడంతో పాటు, శుక్రవారం దేశీయ ద్రవ్యోల్బణ గణాంకాలు విడుదల కాబోతుండడంతో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్లలోని మిశ్రమ సంకేతాలు కూడా దేశీయ సూచీలను కాస్త వెనక్కి లాగుతున్నాయి. దీంతో సెన్సెక్స్, నిఫ్టీ లాభా నష్టాలతో దోబూచులాడుతున్నాయి.బుధవారం ముగింపు (81, 425)తో పోల్చుకుంటే గురువారం ఉదయం దాదాపు 200 పాయింట్ల నష్టంతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత తేరుకుంది. ఒక దశలో 160 పాయింట్లు లాభపడింది. ప్రస్తుతం ఫ్లాట్ గా ట్రేడ్ అవుతోంది. ఉదయం 10:10 గంటల సమయంలో సెన్సెక్స్ 6 పాయింట్ల స్వల్ప లాభంతో 81, 431 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే సాగుతోంది. ప్రస్తుతానికి 2 పాయింట్ల లాభంతో 24, 975 వద్ద కొనసాగుతోం.సెన్సెక్స్ లో బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్, పీఎన్ బీ, ఎన్ హెచ్ పీసీ షేర్లు లాభాల్లో ఉన్నాయి. సోనా బీఎల్ డబ్ల్యూ, ఇన్ఫో ఎడ్జ్, ఎంఫసిస్, గ్లెన్ మార్క్, టాటా ఎలాక్సీ షేర్లు నష్టాల బాటలో కొనసాగుతున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 10 పాయింట్ల లాభంతో ఉంది. బ్యాంక్ నిఫ్టీ 8 పాయింట్ల లాభంతో కొనసాగుతోంది. డాలర్ తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 88.17గా ఉంది.

# గంటల వ్యవధిలోనే ఓవర్ సబ్‌స్క్రైబ్




ప్రముఖ హోమ్ సర్వీసెస్ కంపెనీ అర్బన్ కంపెనీ ప్రారంభ పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) బుధవారం ప్రారంభమైంది. అయితే, ఇన్వెస్టర్ల నుంచి ఊహించని స్థాయిలో స్పందన రావడం విశేషం. ఐపీఓ ప్రారంభమైన కొన్ని గంటల్లోనే పూర్తిగా సబ్ స్క్రైబ్ అయింది. బిడ్డింగ్ మొదటి రోజున ఈ ఇష్యూకు పెట్టుబడిదారుల నుంచి వచ్చిన స్పందనకు మధ్యాహ్నం సమయానికే ఇష్యూ మొత్తం 1.27 రెట్లు సబ్ స్క్రైబ్ అయినట్టు ఎన్ఎస్ఈ డేటా చెబుతోంది. రిటైల్, నాన్-ఇన్ స్టిట్యూషనల్ ఇన్వెస్టర్ల కోటా పూర్తిస్థాయిలో సబ్ స్క్రైబ్ అయింది. మొత్తం 10.68 కోట్ల షేర్లను ఐపీఓ భాగంగా విక్రయానికి ఉంచగా, 13.54 కోట్లకు పైనే బిడ్లు వచ్చాయి. రిటైల్ ఇన్వెస్టర్ల కోటా దాదాపు 4 రెట్లు, నాన్-ఇన్ స్టిట్యూషనల్ ఇన్వెస్టర్ల కోటా 1.6 రెట్లు ఓవర్ సబ్ స్క్రైబ్ అయ్యింది. క్వాలిఫైడ్ ఇన్ స్టిట్యూషన్ బయర్స్ విభాగం 20 శాతం సబ్ స్క్రైబ్ అయ్యింది. కంపెనీ రూ. 1,900 కోట్ల నిధుల సమీకరణ లక్ష్యంతో పబ్లిక్ ఆఫర్ కు వచ్చింది. ఒక్కో షేర్ ధరను రూ. 98-103గా నిర్ణయించింది. ఇప్పటికె యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ. 854 కోట్లను సేకరించిన తర్వాత ఐపీఓ కింద రూ. 1,428 కోట్ల విలువైన షేర్లను అమ్మకానికి ఉంచింది. ఐపీఓలో వచ్చిన నిధులను కంపెనీ క్లౌడ్ ఇన్ ఫ్రా, ఆఫీసుల లీజింగ్ చెల్లింపులు, మార్కెటింగ్, టెక్ అభివృద్ధి, సాధారణ కార్యకలాపాల కోసం ఉపయోగిస్తామని వెల్లడించింది.

# పెట్రోల్, డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి..!



దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలను గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ లోకి తీసుకొచ్చే విషయంపై చాలా రోజులుగా చర్చ జరుగుతోంది. కానీ, ఇప్పుడు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్ డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ కస్టమ్స్ ఛైర్మన్ సంజయ్ కుమార్ అగర్వాల్ దీనిపై కొత్త అప్ డేట్ ఇచ్చారు. సంజయ్ కుమార్ అగర్వాల్ చెప్పిన ప్రకారం, పెట్రోల్, డీజిల్ పై ఇప్పుడు సెంట్రల్ ఎక్సైజ్ డ్యూటీ, వ్యాల్యూ యాడెడ్ ట్యాక్స్ (VAT, రాష్ట్ర పన్ను) విధిస్తున్నారు.ఈ రెండు పన్నులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు భారీ ఆదాయాన్ని తెచ్చిపెడుతున్నాయి. అందుకే, ఈ ఇంధనాలను GST లోకి తీసుకొచ్చేందుకు ప్రస్తుతం అవకాశం లేదన్నారు.

**కేంద్ర ఆర్థిక మంత్రి ఏమన్నారు?**

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కూడా ఈ విషయంపై ప్రస్తావించారు. మేము చట్టపరంగా పెట్రోల్, డీజిల్ ను GST లోకి తీసుకొచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం. కానీ, ఈ నిర్ణయానికి రాష్ట్రాలు కూడా సిద్ధంగా ఉండాలని ఆమె సూచించారు. అంటే, బంతి ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వాల కోర్టులో ఉంది. రాష్ట్రాలు ఒప్పుకుంటే, GST కౌన్సిల్ లో ట్యాక్స్ రేటు గురించి చర్చించి, చట్టం చేయవచ్చు.

**GST వచ్చినప్పటి నుంచి ఈ చర్చ ఎందుకు?**

2017లో GST అమలు చేసినప్పటి నుంచి పెట్రోల్, డీజిల్, మద్యం వంటి వాటిని దీని పరిధిలోకి తీసుకొచ్చే ప్రసక్తే లేదన్నారు. ఎందుకంటే, ఈ ఉత్పత్తులపై వచ్చే ఎక్సైజ్ డ్యూటీ, VAT ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు భారీ ఆదాయం వస్తోంది.కొన్ని రాష్ట్రాలకు అయితే ఈ పన్నులు వాళ్ల మొత్తం ట్యాక్స్ ఆదాయంలో 25-30% వరకు ఉంటాయి. అందుకే, రాష్ట్రాలు ఈ ఆదాయాన్ని వదులుకోవడానికి ఇష్టపడటం లేదు. పైగా, ఈ పన్నుల ద్వారా ధరలను నియంత్రించడం, వినియోగాన్ని ప్రభావితం చేయడం వంటి అధికారం కూడా రాష్ట్రాలకు ఉంటుంది.

# ఎంసీఎల్‌ఆర్ తగ్గించిన యూకో బ్యాంక్




ప్రభుత్వ రంగ యూకో బ్యాంక్ తన మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేటు (ఎంసీఎల్ ఆర్ )ను 5 బేసిస్ పాయింట్ల మేరకు తగ్గించింది. దీంతో వివిధ వ్యవధులకు సంబంధించి రిటైల్, కార్పొరేట్ రుణాల కొత్త వడ్డీ రేట్లు 8.95 శాతం నుంచి 8.90 శాతంగా ఉంటాయి. అంతేకాకుండా బ్యాంకు 10 ఏళ్ల ప్రభుత్వ సెక్యూరిటీలపై వడ్డీని పెంచినట్టు బుధవారం ప్రకటనలో తెలిపింది. సవరించిన రేట్లు సెప్టెంబర్ 10 నుంచి అమలులోకి వస్తాయని పేర్కొంది. బ్యాంకు అధికారిక వివరాల ప్రకారం, ఓవర్ నైట్, నెల, మూడు నెలలు, ఆరు నెలల కాలపరిమితులపై రుణాల రేట్లు ఐదు బేసిస్ పాయింట్లు తగ్గుతాయి. 10 ఏళ్ల ప్రభుత్వ సెక్యూరిటీలపై వడ్డీ 6.51 శాతం నుంచి 6.78 శాతానికి పెరుగుతాయని వెల్లడించింది. యూకో బ్యాంకు నిర్ణయంతో ఎంసీఎల్ ఆర్ కు అనుసంధానంగా ఉన్న గృహ, వాహన, వ్యక్తిగత రుణాల వడ్డీ రేట్లకు వర్తిస్తుంది.



## హిజ్రా క్యారెక్టర్ చేయడం నా కల

అయితే టాలీవుడ్ సీనియర్ నటి శోభన మాత్రం తన కల ఏంటంటే.. తెరపై హిజ్రాగా నటించడం అని సంచలన వ్యాఖ్యలు చేశారు.శోభన చెబుతున్నది ఏమిటంటే.. 'తెరపై హిజ్రా పాత్ర చాలా ఛాలెంజింగ్ ది, చూడటానికి సులభంగా అనిపించినా, నిజానికి అది నటించడానికి గొప్ప ధైర్యం, నైపుణ్యం కావాలి. ఇప్పటికే కొంతమంది దర్శకులతో ఈ విషయం గురించి మాట్లాడాను, కానీ వాళ్లు తనను అలాంటి పాత్రలో చూపించడానికి సిద్ధంగా లేరని వెల్లడించారు. ఎందుకంటే ప్రేక్షకులు కూడా నన్ను అలా చూడటానికి ఇష్టపడరేమో అనే సందేహం నాకు ఉంది. అయినప్పటికీ, ఎవరైనా దర్శకుడు నన్ను ఆ పాత్ర కోసం సంప్రదిస్తే.. ఎలాంటి సందేహం లేకుండా వెంటనే ఓకే చెబుతాను" అని శోభన స్పష్టం చేశారు. ఇంతటి గౌరవం, గుర్తింపు పొందిన శోభన, తన కల మాత్రం ఒక హిజ్రా పాత్ర అని చెప్పడం అందరిని ఆశ్చర్యానికి గురిచేస్తోంది. నిజంగా ఎవరైనా దర్శకుడు ఆమె కలను నిజం చేస్తారా? లేక ఈ డ్రీమ్ క్యారెక్టర్ శోభన మనసులోనే మిగిలి పోతుందా? అన్నది ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది.




## కిష్కింధపురి.. ప్రీమియర్..

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమ పరమేశ్వరన్ జోడిగా వస్తున్న చిత్రం కిష్కింధపురి. షైన్ స్క్రీన్స్ బ్యానర్ పై సాహు గారపాటి నిర్మిస్తున్నారు. కౌశిక్ పెగల్లపాటి దర్శకత్వం వహించాడు. హారర్ థ్రిల్లర్ జానర్ లో వస్తున్న ఈ సినిమా ట్రైలర్ కు మంచి స్పందన లభించింది. ఈ నెల 12న ఈ సినిమా వరల్డ్ వైడ్ గా రిలీజ్ కాబోతుంది. కాగా ఈ సినిమాను భారీ స్థాయిలో ప్రమోట్ చేస్తున్నాడు బెల్లం కొండ శ్రీనివాస్.తాజాగా ఈ సినిమా ప్రీమియర్ ను AAA మల్టిప్లెక్స్ లో ప్రదర్శించగా యునానిమాస్ గా పోజిటివ్ టాక్ తెచ్చుకుంది. విరూపాక్ష తర్వాత తెలుగులో హారర్ జానర్ లో మంచి సినిమాలు రాలేదు. ఆ లోటుని ఇప్పుడు కిష్కింధపురి తీర్చిందని టాక్ వినిపిస్తోంది. ఫస్టాఫ్ లో కాసిన నవ్వులతో పాటు కావాల్సినంత భయపెట్టాడు దర్శకుడు. కిష్కింధపురిలోని సువర్ణ మాయలో ఏమి జరిగిందనే దాన్ని ఉత్కంఠను ఏక్కడ ట్రాక్ తప్పకుండా అద్భుతంగా తెరకెక్కించారు. సెకండాఫ్ లో వచ్చే ట్విస్ట్ లు ఊహించిన దానికంటే బిన్నంగా ఆశ్చర్యపరుస్తాయి. క్లైమాక్స్ లో బెల్లంకొండ, అనుపమ కెరిర్ బెస్ట్ పర్ఫామెన్స్ అనే చెప్పాలి. అలానే తమిళ నాటుడు శాండీ బాగా భయపెట్టాడు. ఇక బాగ్రౌండ్ మ్యూజిక్ సినిమాను మరో స్థాయికి తీసుకు వెళ్ళింది. హారర్ సినిమాలో కీలకమైన సౌండింగ్ ఈ సినిమాలో చాలా చక్కగా ఉంది. అలాగే సినిమాటోగ్రఫీ చాలా బాగుంది. నైట్ లొకేషన్స్ కూడా తెరపై అద్భుతంగా ప్రెసెంట్ చేసాడు. ఇక ప్రొడక్షన్ వాల్యూస్ కూడా రిచ్ గా ఉన్నాయి. ఎక్కడ కంప్రమైజ్ కాకుండా ఖర్చు పెట్టారు. ఇక ఈ సినిమా గురించి ఒక లైన్ లో చెప్పాలంటే 125నిమిషాల కిష్కిందపురి సూపర్ హిట్ అనే చెప్పొచ్చు. సీట్ ఎడ్జ్ లో కూర్చుని చేసేలా చేస్తుంది.

## హృదయాన్ని హత్తుకున్న శ్రీలీల రిప్లై

ప్రస్తుతం శ్రీ లీల, పవర్ స్టార్ పవన్ కల్యాణ్ సరసన హరీష్ శంకర్ దర్శకత్వంలో వస్తున్న ఉస్తాద్ భగత్ సింగ్ లో నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా కొనసాగుతుండగా, ఇతర పెద్ద ప్రాజెక్టులతో కూడా శ్రీ లీల బిజీగా ఉన్నారు.అయినా కూడా తన అభిమానుల కోసం ఎప్పుడూ సమయం కేటాయించే లీల, తరచూ సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటారు. ఇటీవల ఇన్ స్టాలో చాట్ సెషన్ నిర్వహించిన ఆమెకు ఒక అభిమాని "నేను చాలా నిరుత్సాహంగా ఉన్నాను" అని మెసేజ్ పంపాడు. దానికి శ్రీ లీల స్పందిస్తూ.."నేను హెల్ప్ చేయగలనో లేదో తెలియదు కానీ.. వెంటనే వెళ్లి మీ కుటుంబ సభ్యుడిని హత్తుకోండి. నేను కూడా అలాగే చేస్తాను. అలాగే మంచి సంగీతం వింటే అది థెరపీలా పనిచేస్తుంది" అని రిప్లై ఇచ్చారు. ఈ జవాబు అభిమానులు బాగా ఆకట్టుకుంది. ఫ్యాన్ భావోద్వేగాన్ని అర్థం చేసుకుని, అతని బాధను తగ్గించేలా స్పందించిన తీరు అందరినీ హత్తుకుంది. సినిమాల విషయానికొస్తే, త్వరలో శ్రీలీల నటించిన 'మాస్ జాతర' సినిమా రిలీజ్ కి సిద్ధమవుతోంది. అలాగే, కోలీవుడ్ లో శివకార్తికేయన్ తో పరాశక్తి, బాలీవుడ్ లో కార్తీక్ ఆర్యన్ తో మరో చిత్రం చేస్తున్నారు. ఈ ప్రాజెక్టులతో శ్రీలీల క్రేజ్ మరింత పెరుగుతోంది.




## 'చాయ్‌వాలా' ఫస్ట్ సింగిల్ అప్డేట్



టాలీవుడ్ యంగ్ హీరో శివ కందుకూరి, ప్రమోద్ హర్ష కాంబినేషన్ లో తెరకెక్కుతున్న మూవీ 'చాయ్ వాలా'. హర్షిక ప్రొడక్షన్స్ బ్యానర్ పై రాధా విజయలక్ష్మి, వెంకట్ ఆర్ పాపుడిప్పు భారీ ఎత్తున నిర్మిస్తున్నారు. ఇందులో శివ సరసన తేజు అశ్విని హీరోయిన్ గా నటిస్తోంది. డిఫరెంట్ కాన్సెప్ట్ తో రాబోతున్న ఈ చిత్రంలో రాజీవ్ కనకాల, రాజ్ కుమార్ కసిరెడ్డి, చైతన్య కృష్ణ, వడ్లమాని శ్రీనివాస్ కీలక పాత్రలో కనిపించబోతున్నారు. ఈ చిత్రం ఈ ఏడాది చివర్లో థియేటర్స్ లోకి రాబోతుంది. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ సినిమాకు సంబంధించిన వరుస అప్డేట్స్ రిలీజ్ చేస్తూ మేకర్స్ ఆసక్తిని పెంచుతున్నారు. ఈక్రమంలో.. తాజాగా, 'చాయ్ వాలా' చిత్రబృందం మ్యూజికల్ జర్నీ స్టార్ట్ చేసినట్లు తేజు అశ్విన్ ప్రకటించింది. ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ సింగిల్ 'సఖిరే' మెలోడీ సాంగ్ ప్రోమో రిలీజ్ చేసింది. ఫుల్ సాంగ్ సెప్టెంబర్ 11న సాయంత్రం 5గంటలకు రాబోతున్నట్లు వెల్లడించింది. ఈ పోస్ట్ కు ''ప్రేమ తన మధురత్వాన్ని కనుగొంటుంది'' అనే క్యాప్షన్ జత చేసింది.

## డెకాయిట్ సినిమాలో నేషనల్ అవార్డు విన్నర్




టాలీవుడ్ హీరో అడివి శేష్ నటిస్తున్న హైలీ యాంటిసిపేటెడ్ పాన్ ఇండియన్ థ్రిల్లర్ మూవీ 'డెకాయిట్'. ఇందులో యంగ్ బ్యూటీ మృణాల్ ఠాకూర్ హీరోయిన్ గా నటిస్తుండగా.. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. షానియల్ డియో దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాను అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్ పై సుప్రియా యార్లగడ్డ, సునీల్ నారంగ్ భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. ఇందులో అనురాగ్ కశ్యప్, ప్రకాష్ రాజ్, జైన్ మరియే ఖాన్, సునీల్, కామాక్షి భాస్కర్ల కీలక పాత్రలో కనిపించబోతున్నారు. డిసెంబర్ 25న క్రిస్మస్ కానుకగా రాబోతున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న 'డెకాయిట్' నుంచి వరుస పోస్టర్లు రిలీజ్ అవుతున్నాయి. తాజాగా, ఈ సినిమాలో నేషనల్ అవార్డు విన్నర్ గా నిలిచిన అద్భుతమైన యాక్టర్ నటిస్తున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. నేడు అతుల్ కులకర్ణి పుట్టినరోజు కావడంతో ఆయన కీలక పాత్రలో నటిస్తున్నట్లు వెల్లడించారు. దీంతో ఈ మూవీపై హైప్ పెరిగిపోయింది.

## రికార్డ్ బ్రేకింగ్ ఓటీటీ డీల్..

నందమూరి బాలకృష్ణ, డైరెక్టర్ బోయపాటి శ్రీను కాంబో వచ్చిన 'సింహ ', 'లెజెండ్', 'అఖండ ' సినిమాలు ఎంతటి సంచలనాలు సృష్టించాయో ప్రత్యేకంగా చెప్పాలా. అఖండ తో చిత్ర పరిశ్రమలు ఊపునిచ్చిన ఈ సినిమాకు సీక్వెల్ గా 'అఖండ -2 ను తెరకెక్కిస్తున్నాడు బోయపాటి. ఇటీవల రిలీజ్ చేసిన అఖండ 2 ఫస్ట్ గ్లిమ్స్ ఎంతటి సంచలనం సృష్టించిందో చెప్పక్కర్లేదు. షూటింగ్ తో పాటు డబ్బింగ్ పనులను ముగించుకున్న ఈ సినిమాకు సంబంధించి ప్రస్తుతం గ్రాఫిక్స్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.కాగా ఈ సినిమా ఓటీటీ డీల్ ఇప్పుడు టాలీవుడ్ సర్కిల్స్ లో హాట్ టాపిక్ గా మారింది. ఈ సినిమా ఓటీటీ రైట్స్ ను ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్ ఫ్లిక్స్ కొనుగోలు చేసింది. అఖండ 2 ను నెట్ఫ్ ఫ్లిక్స్ రూ. 80 కోట్లకు కొనుగోలు చేసినట్టు బిజినెస్ సర్కిల్స్ లో వినిపించే టాక్. బాలయ్య క్రేజ్ తో పాటు కాంబినేషన్ క్రేజ్ కూడా తోడవడంతో భారీ ధర పెట్టిందట. అయితే పాన్ ఇండియా స్థాయిలో వందల కోట్ల మార్కెట్ కలిగిన నలుగురు తెలుగు హీరోలకు మాత్రమే ఆ ధర ఉంది. ఇప్పుడు ఆ స్థాయి రేట్ బాలయ్య సినిమాకు రావడం రికార్డ్ అనే చెప్పాలి. ఏదేమైనా నిర్మాతలకు ఓటీటీ రూపంలో జాక్ పాట్ తగిలిందనే చెప్పాలి. కాగా అఖండ 2 ను ఈ ఏడాది డిసెంబరు 5 న రిలీజ్ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 14 రీల్స్ ప్లస్ బ్యానర్ పై రామ్ అచంట -గోపీ అచంట నిర్మిస్తున్న ఈ సినిమాకు థమన్ సంగీతం అందిస్తున్నాడు.





## దుల్కర్ సల్మాన్ సినిమాలో హీరోయిన్ ఫిక్స్

మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ భాషతో సంబంధం లేకుండా వరుస సినిమాలు చేస్తున్నారు. బ్యాక్ టు బ్యాక్ ప్రాజెక్ట్స్ అనౌన్స్ చేస్తూ తీరిక లేకుండా గడుపుతున్నారు. ప్రస్తుతం దుల్కర్ సల్మాన్ 41వ చిత్రంతో ఫుల్ బిజీ బిజీగా గడుపుతున్నారు. రవి నెలకుదిటి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాకు జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. ప్రేమ కథా చిత్రంగా రాబోతుండగా..SLVసినిమాస్ బ్యానర్ పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈమూవీకి సంబంధించిన పూజా కార్యక్రమాలు పూర్తి చేసుకోగా.. షూటింగ్ ఎప్పుడెప్పుడు స్టార్ట్ అవుతుందా.. అప్డేట్స్ విడుదల చేస్తారా అని దుల్కర్ ఫ్యాన్స్ ఎదురుచూస్తున్నారు.ఈ నేపథ్యంలో.. తాజాగా, మూవీ మేకర్స్ 'DQ-41' చిత్రానికి సంబంధించిన డబుల్ అప్డేట్స్ ఇచ్చి అందరినీ సర్ ప్రైజ్ చేశారు. ఈ సినిమాలో దుల్కర్ సరసన పూజా హెగ్దే నటిస్తున్నట్లు షూటింగ్ వీడియోను షేర్ చేశారు. ''మంత్రముగ్ధురాలు పూజా హెగ్దేను స్వాగతిస్తున్నాము. 'DQ-41' సినిమా కోసం షూట్ లో చేరారు. దుల్కర్, పూజా కెమిస్ట్రీ బిగ్ స్క్రీన్ పై మ్యాజిక్ చేయనుంది. మరిన్ని అప్డేట్స్ త్వరలోనే రాబోతున్నాయి వేచి ఉండండి'' అని రాసుకొచ్చారు. నేటి నుంచి షూటింగ్ ప్రారంభించిన చిత్రబృందం దుల్కర్, పూజాతో పలు సీన్లు చేస్తున్నారు. ప్రస్తుతం మూవీ మేకర్స్ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా.. ఈ విషయం తెలుసుకున్న వారంతా వావ్ సూపర్ జోడి అని కామెంట్లు పెడుతున్నారు.



## ఆమె నా స్ఫూర్తి..

''సూపర్ హీరో సినిమాలు నాకు చిన్నప్పటి నుంచి చాలా ఇష్టం. మిరాయ్ నేను కూడా సూపర్ పవర్స్ ఉన్న యువతిగా కనిపిస్తాను. రెండున్నరేళ్ల పాటు కష్టపడి చేసిన ఈ సినిమా నా కెరీర్ లో ప్రత్యేకమైన మలుపు అవుతుంది. అశోకవనంలో అర్జున కళ్యాణం తర్వాత మంచి కథ కోసం ఎదురు చూస్తున్నప్పుడు, కార్తీక్ ఘట్టమనేని వినిపించిన ఈ కథలోని ఫాంటసీ, ప్రేమ, యాక్షన్ అంశాలు నాకు బాగా నచ్చాయి. అందుకే వెంటనే అంగీకరించాను.'ఇందులో నేను విభ అనే బలమైన సన్యాసిని పాత్రలో కనిపిస్తాను. హిమాలయాల్లో ఉండే ఈ పాత్ర ప్రయాణం ఏమిటన్నది తెరపైనే ఆసక్తికరంగా తెలుస్తుంది. నా నిజ జీవితానికి పూర్తిగా భిన్నమైన ఈ రోల్ చేయడం నాకు పెద్ద సవాల్. సాధారణంగా నేను చాలా మాట్లాడుతుంటాను కానీ విభ మాత్రం ప్రశాంతమైన శక్తివంతమైన పాత్ర. ఈ సినిమాలో ఎక్కువ భాగం సన్నివేశాలు నిజమైన మంచు పర్వతాలు, అడవుల్లో చిత్రీకరించాం. ఆ కఠిన పరిస్థితుల్లో షూటింగ్ చేయడం ఓ సాహసంలా అనిపించింది'' అని వివరించారు.

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**